ANDHRA JYOTI VIJAYAWADA. Regd. No. H 543

Date = 13-6-70

ఉదయం

★★★ Telephone : 4343

చందా రేట్లు

	ఏజెంటు ద్వారా రూ. పై.	పోష్టు ద్వారా రూ.
ఒక మాసానికి	3-75	5-00
మూడు మాసాలకు	11-25	15-00
ఆరు మాసాలకు	22-50	30-00
సంవత్సరానికి	45-00	60-00

సర్క్యులేషన్ మేనేజర్,
ఆంధ్రజ్యోతి, పో. బా. నెం. 334, విజయవాడ-2.

ఆంధ్రజ్యోతి

ఎడిటర్ : నార్ల వెంకటేశ్వరరావు

121502

సంపుటి 10 :: సంచిక 338

విజయవాడ, జూన్ 12, 1970 శుక్రవారం

6 పేజీలు :: 12 పైసలు

ఆంధ్రజ్యోతి
సచిత్ర వార పత్రిక
★
మీ కుటుంబానికి ఉత్తమ కాలక్షేప సాధనం
వారం వారం తప్పక చదవండి
★
పేజీలు : 64 • వెల : 40 పైసలు

పోయిన పదేళ్ళలో 20 లక్షల ఎకరాల బంజర్ల పంపిణీ

దాదాపు ఎనిమిది లక్షల కుటుంబాలకు లాభించినట్లు ముఖ్యమంత్రి ప్రకటన

అసెంబ్లీ నవంబర్ సమావేశంలో కౌలుదారీ బిల్లు చర్చకు ప్రతిపాదించనున్నట్లు వెల్లడి

('ఆంధ్రజ్యోతి' ప్రతినిధి) హైదరాబాద్, జూన్ 11—

కడచిన పది సంవత్సరాలలో ఇరవై లక్షల ఎకరాలకు పైగా ప్రభుత్వపు బంజరు భూములను పేద ప్రజలకు పంచిపెట్టినట్టు ముఖ్యమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి నేడిక్కడ ప్రకటించారు.

శ్రీ బ్రహ్మానందరెడ్డి పత్రికా విలేకరులతో మాట్లాడుతూ బంజర్ల పంపిణీలో సాధించిన పురోభివృద్ధిని సమీక్షించారు.

రెండు, మూడు లక్షల ఎకరాలు మినహాగా లభ్యమైన దాదాపు మొత్తం బంజరు భూములను పంపకం చేసినట్టు ఆయన చెప్పారు.

1960-66 మధ్య కాలంలో పది లక్షల ఎకరాలను పంచిపెట్టగా, 1967-70 మధ్య కాలంలో 10.48 లక్షల ఎకరాలను పంచిపెట్టినట్టు ఆయన తెలియజేశారు.

అందులో దాదాపు ఆరు లక్షల ఎకరాల భూమిని క్రిందటి సంవత్సరం నవంబర్‌లో విస్తృత కార్యక్రమాన్ని ప్రారంభించిన తర్వాతనే పేదప్రజలకు కేటాయించినట్టు ఆయన పేర్కొన్నారు.

బంజరు భూముల పంపిణీవల్ల దాదాపు ఎనిమిది లక్షల కుటుంబాలు ప్రయోజనాలను పొందినట్టు, అయితే, ఎంత భూమిని వాస్తవంగా స్వాధీనంలోకి తీసుకొని వచ్చినదీ తాను చెప్పజాలనని ముఖ్యమంత్రి అన్నారు.

హరిజనులకు ఇళ్ళస్థలాలు

హరిజనులకు, గిరిజనులకు ఆర్థికంగా వెనుకబడిన ఇతర వర్గాలకు ఇళ్ళ స్థలాల మంజూరు గురించి ప్రస్తావిస్తూ, కడచిన పదేళ్ళలో ఇళ్ళ స్థలాల పంపిణీపై దాదాపు రెండున్నర కోట్ల రూపాయల సొమ్మును ఖర్చు చేసినట్టు ముఖ్యమంత్రి చెప్పారు. ప్రస్తుత సంవత్సరాంతం నాటికి దాదాపు లక్ష మంది ప్రజలకు ఇళ్ళ స్థలాలు సమకూరగలవని భావిస్తున్నట్టు ఆయన చెప్పారు.

అయితే, దీనితో అసలు సమస్యలో సగం వంతు మాత్రమే తీరిపోగలదని చతుర్థ ప్రణాళిక పూరి అయ్యే నాటికి ఈ సమస్యను పరిష్కరించవలెనంటే రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఆర్థికసహాయం చేయడం అవసరమని ముఖ్యమంత్రి వివరించారు.

వ్యవసాయదారులకు పరపతి సౌకర్యాలు

వ్యవసాయదారులకు పరపతి సౌకర్యాల కల్పన గురించి పేర్కొంటూ, 1970-71 సంవత్సరంలో స్వల్పకాలిక ఋణాల కింద 42 కోట్ల రూపాయలు మంజూరు చేయడానికి సంకల్పించినట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు.

1969-70 సంవత్సరంలో రైతులకు స్వల్పకాలికపు ఋణాల క్రింద 25 కోట్లు ఇచ్చినట్టు ఆయన చెప్పారు. అందులో అయిదు వందల రూపాయలు, అంతకంటె తక్కువ మొత్తాలలో ఋణాలు పొందినవారు యాభై శాతం వరకు వున్నట్టు ఆయన తెలిపారు.

దీర్ఘకాలిక ఋణాలు

దీర్ఘకాలిక ఋణాలను గురించి ముఖ్యమంత్రి చెబుతూ 1969-70 లో 18.69 కోట్లు ఋణంగా ఇవ్వడం జరిగినదని, 1970-71 లో 25 కోట్ల రూపాయలు ఇవ్వాలని సంకల్పించామని అన్నారు.

ఈ ఋణాలవల్ల ప్రయోజనం పొందుతున్నవారిలో నూటికి 76 వంతుల మంది అయిదు ఎకరాలలోపు భూమిగల చిన్నరైతులని ఆయన చెప్పారు.

తాలూకా కేంద్రాలలో ఇళ్ళ కొరత

తాలూకా, జిల్లా కేంద్రాలలో ఇళ్ళ కొరతను తగ్గించే నిమిత్తం గృహ నిర్మాణానికి సహకార గృహ నిర్మాణ సంఘాల సముఖ్య పెట్టుబడిని ఈ ఏడాది 180 లక్షల రూపాయలకు పెంచగలదని శ్రీ బ్రహ్మానందరెడ్డి చెప్పారు.

గృహనిర్మాణ సంస్థను ఎప్పుడు పునర్నిర్మాణ ప్రశ్నించగా "తగు సమయంలో" అని ఆయన సమాధానం చెప్పారు.

హౌసింగ్‌బోర్డు అధ్యక్షునిపై వచ్చిన ఆరోపణలను పరిశీలిస్తున్నట్టు ఆయన చెప్పారు.

భూసంస్కరణల అమలుకు చర్యలు

రాష్ట్రంలో భూసంస్కరణల అమలుకు గైకొంటున్న చర్యలను గురించి ప్రశ్నించగా బొంబాయి సమావేశంలో అధికార కాంగ్రెసు గైకొన్న నిర్ణయాలను అమలు జరపగలమని, అలాగే భూ కమతాల పరిమితి చట్టాన్ని కూడా అమలుపరచగలమని ముఖ్యమంత్రి సమాధానం చెప్పారు.

మిగులు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొనడానికి ఈ ఏడాది బడ్జెట్టులో 50 లక్షలు కేటాయించినట్టు ఆయన తెలియజేశారు.

కౌలుదారి బిల్లుపై సెలక్టు కమిటి నివేదిక

కౌలుదారి బిల్లుపై సెలక్టు కమిటి నివేదికను నవంబర్‌లో ప్రారంభం కానున్న అసెంబ్లీ శీతకాల సమావేశంలో ప్రవేశపెట్టగలమని ఆయన చెప్పారు.

అసెంబ్లీ వర్షాకాల సమావేశం జులై మూడవ వారంలో ప్రారంభంకాగలదని ఆయన వెల్లడించారు.

పట్టణ ఆదాయాలపై పరిమితి విధించడానికి రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకికాదని ఒక ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. వాస్తవానికి గుంటూరులో 1966 లో జరిగిన ఎ. ఐ. సి. సి. సమావేశంలో పట్టణ ఆదాయాలపై పరిమితి విధించాలన్న తీర్మానాన్ని ఆమోదించడం జరిగిందని శ్రీ బ్రహ్మానందరెడ్డి చెప్పారు.

ముఖ్యమంత్రి రేపు ఢిల్లీ వెళ్ళి 16వ తేదీన తిరిగి వస్తారు.

ప్రతిపక్ష కాంగెసు కార్యకర్తల అరెస్టు

హోం మంత్రి చవాన్‌కు శ్రీ నిజలింగప్ప లేఖ

న్యూఢిల్లీ, జూన్ 11—జమ్ము-కాశ్మీరులో తమ పార్టీ కార్యకర్తలను ముఖ్యంగా శ్రీ వైష్ణవిని నియంతృత్వ వైఖరితో అరెస్టు చేసినందుకు నిరసన తెలియజేస్తూ ప్రతిపక్ష కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ నిజలింగప్ప హోం మంత్రి శ్రీ చవాన్‌కు లేఖ వ్రాశారు.

అరెస్టు అయిన పార్టీ కార్యకర్తలను జైలులో బాధలు పెడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపించాలని కూడా శ్రీ నిజలింగప్ప విజ్ఞప్తి చేశారు.

ఆంధ్ర ఉద్యోగుల సర్వీసు సమస్యలు

హైదరాబాద్‌లో అధికారుల విచారణ

హైదరాబాద్, జూన్ 11— ఆంధ్ర ఉద్యోగుల సీనియారిటీ, ప్రమోషన్లు వేతనాల నిర్ణయాలకు సంబంధించిన కేసులను విచారించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హోం శాఖల సంయుక్త కార్యదర్శులు ఇటీవల ఇక్కడ మూడు రోజులపాటు సమావేశమై 250 కేసులను పరిష్కరించారు.

అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీ ఖాదర్ జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఉప కార్యదర్శి శ్రీ వి. నారాయణ కూడా హాజరైనారు.

ఈ బృందం నిన్న సాయంత్రం ఢిల్లీ వెళ్ళింది.

గోదావరి లోయలో భూకంపం

హైదరాబాద్, జూన్ 11— ఇక్కడకు 250 కిలోమీటర్ల దూరంలో గోదావరి లోయలో నేటి ఉదయం 8 గంటల 44 నిమిషాల 23 సెకండ్ల సమయంలో భూమి కంపించినట్టు ఇక్కడ వున్న జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ పరికరాలు నమోదు చేశాయని ఆ సంస్థ ప్రతినిధి తెలియజేశారు.

సతీసమేతంగా విదేశ పర్యటనకు వెళ్ళిన రాష్ట్రపతి శ్రీ గిరికి ఢిల్లీ విమానాశ్రయంలో ప్రధాని ఇందిరా గాంధి, శ్రీ జగ్‌జీవన్‌రామ్ ప్రభృతులు వీడ్కోలిచ్చినప్పటి చిత్రం

కేంద్ర ఎలెక్షన్ కమిషన్ సీనియర్ అధికారులు హైదరాబాద్ రాక

—ఖైరతాబాద్ ఉపఎన్నిక పర్యవేక్షణకై

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, జూన్ 11—

ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఇక్కడి ఖైరతాబాద్ నియోజక వర్గం నుంచి ఆదివారంనాడు జరగనున్న ఉప ఎన్నికను పర్యవేక్షించడానికిగాను కేంద్రం ఎన్నికల కమిషన్, ఇద్దరు సీనియర్ అధికారులను నేడు ఇక్కడికి పంపించింది.

సీనియర్ అధికారులైన శ్రీయుతులు రోషన్ లాల్, నాగసుబ్రహ్మణ్యం ఎలెక్షన్ కమిషన్ కార్యదర్శులు.

వీరు ఇక్కడికి రాగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఎన్నికల అధికారి అయిన శ్రీ ఎస్. ఎ. ఖాదర్‌ను కలుసుకుని ఉప ఎన్నిక నిర్వహణ గురించి చర్చలు జరిపారు.

పోటీచేస్తున్న అభ్యర్థులను కూడా ఈ సీనియర్ ఉద్యోగులు కలుసుకున్నారు. ఎన్నిక సందర్భంగా వచ్చిన ఫిర్యాదులను విన్నారు.

ఈ ఉప ఎన్నిక సక్రమంగా జరగదన్న భయాందోళనలు ప్రజా సమితి వారు వెలిబుచ్చినందున, ప్రజా సమితి వాయకుల విజ్ఞప్తిని పురస్కరించుకుని కేంద్రం ఎలెక్షన్ కమిషన్ ఈ సీనియర్ ఉద్యోగులను ఇక్కడికి పంపించింది.

ఈ అధికారులు ఎన్నిక పూర్తిఅయి, ఫలితాలు ప్రకటించేవరకు ఇక్కడ వుంటారు.

విద్యార్థుల కార్యాచరణ సంఘం విజ్ఞప్తి

ప్రజాసమితి అభ్యర్థికి ఓటు చేయవలసిందిగా ఓటర్లకు విజ్ఞప్తిచేస్తూ తెలంగాణా హైస్కూల్ విద్యార్థుల కేంద్ర కార్యాచరణ సంఘం అధ్యక్షుడు ఒక ప్రకటన చేశారు.

పటంచెరులో 144 వ సెక్షన్

రెండు రాజకీయవర్గాల మధ్య ఉద్రిక్తత దృష్ట్యా

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 11—సంగారెడ్డి సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్, రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ సయ్యద్ హుస్సేన్ నిన్న పటంచెరులో ఒక వారం రోజులపాటు ఆర్. పి. సి. 144వ సెక్షన్ ప్రకటించారు.

రెండు రాజకీయ వర్గాలమధ్య ఉద్రిక్తత ఫలితంగా ఈ ఉత్తర్వు జారీచేయడం జరిగింది.

పరిస్థితిని అదుపులో వుంచడానికి సంగారెడ్డి నుంచి అదనపు పోలీసు దళాన్నికూడా పిలిపించారు.

కుమారికల్వలో మృతుల సంఖ్య తొమ్మిదికి పెరుగుదల

పంచాయతీఎన్నికల సందర్భంగా

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 11— కడపజిల్లా రాయచోటి తాలూకాలోని కుమారకల్వ పంచాయతీ ఎన్నికల సందర్భంగా మరణించిన వారి సంఖ్య నేడు తొమ్మిదికి పెరిగింది.

ఆస్పత్రిలో చేర్చిన 22 మంది క్షతగాత్రులలో ఒకరు చనిపోవడంతో ఈ సంఖ్య పెరిగింది.

కడపజిల్లాకు చెందిన మరొక గ్రామంలో మంగళవారంనాడు ఎన్నికల సందర్భంగా జరిగినట్టు నేడిక్కడ పోలీసు కేంద్రి కార్యాలయానికి అందిన వార్తవల్ల తెలుస్తున్నది.

లక్కిరెడ్డిపల్లి సమితిలోని చీమల చెరువుపల్లి గ్రామంలో ఒక పార్టీకి చెందిన నలుగురు వ్యక్తులు ఓటర్లపై లైసెన్సు లేని ప్రేలుడు ఆయుధాలతో కాల్పులు జరపగా, ప్రత్యర్థి వర్గానికి చెందిన ఆరుగురు గాయపడ్డారు. పోలీసులు జోక్యంచేసుకొన్న తర్వాత పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్టు ఈ వార్త పేర్కొన్నది.

దక్షిణ లెబనాన్ శరణార్థుల సహాయార్థం 25 వేల రూపాయలు విరాళంగా ఇవ్వడానికి ఇండియా ప్రభుత్వం నిశ్చయించింది.

గుజరాత్ అసెంబ్లీలో ప్రతిపక్షం బలం తగ్గుదల

స్వతంత్రపార్టీ నుంచి ఒకని రాజీనామా: తిరిగి పాలక పక్షంలో వేరొకని ప్రవేశం

అహమ్మదాబాద్, జూన్ 11—

గుజరాత్ అసెంబ్లీలో ప్రతిపక్షం నుంచి మరి ఇద్దరు చీలిపోయినట్టు నేడు అసెంబ్లీలో స్పీకర్ ఆర్. టి. లీవా ప్రకటించారు.

స్వతంత్ర పార్టీకి చెందిన శ్రీ పరన్ భాయి ఎస్. పటేల్ పార్టీకి రాజీనామా చేసి ఇండిపెండెంటుగా తనకు సీటు కేటాయించవలసిందిగా స్పీకర్‌ను కోరారు.

ప్రతిపక్ష కాంగ్రెసునుంచి ఇటీవల మరి అయిదుగురితో కలిసి బయటకు వచ్చి ఇండిపెండెంట్‌గా వ్యవహరిస్తున్న శ్రీ షివాహర్ చావ్‌దా తాను తిరిగి ప్రతిపక్ష కాంగ్రెసులో చేరుతున్నట్లు ప్రకటించారు.

స్వతంత్ర పార్టీకి చెందిన శ్రీ జబర్ భాయి గజారా గత మంగళవారంనాడు తాను ఇండిపెండెంట్‌గా వ్యవహరించదలచినట్టు తెలియజేశారు.

శ్రీ చావ్‌దా తిరిగి ప్రతిపక్ష కాంగ్రెసులో చేరడంతో 168 మంది సభ్యులుగల అసెంబ్లీలో పాలకపక్షం బలం 87 కు పెరిగింది. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరిగినప్పుడు ప్రభుత్వానికి మరి నల్గురు ఇండిపెండెంట్లు బలపరచగలరని అనుకుంటున్నారు.

స్వతంత్రపార్టీ నుంచి వేరొక సభ్యుడు రాజీనామా చేయడంతో అసెంబ్లీలో ఆ పార్టీ బలం 52 కు తగ్గింది.

అధికార కాంగ్రెసుతో బి. కె. డి. విలీనీకరణ

లక్నోలో ఉభయ పక్షాల మధ్య పరిశీలనాత్మక చర్చలు

లక్నో, జూన్ 11—ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ చరణ్‌సింగ్ అధికార కాంగ్రెసుతో తమ పార్టీ విలీనీకరణ విషయమై జరుగుతున్న చర్చల సందర్భంలో నేడు ఢిల్లీ సందర్శించనున్నట్టు తెలియవచ్చింది.

బి.కె.డి. చెయిర్మన్ శ్రీ చరణ్‌సింగ్ నియమించిన త్రిసభ్య సంఘానికి, ఉత్తరప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కమలాపతి త్రిపాఠికి మధ్య కాంగ్రెసుతో బి. కె. డి. విలీనీకరణ సమస్య గురించి నిన్న ఇక్కడ పరిశీలనాత్మకమైన చర్చలు జరిగాయి.

కొన్ని అపోహలను తొలగించడానికి ఈ చర్చలు తోడ్పడినట్టు ఉభయ పక్షాల సన్నిహిత వర్గాలు తెలియజేశాయి.

కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనడానికి శ్రీ త్రిపాఠీ నిన్న రాత్రి ఇక్కడి నుంచి బయలుదేరి ఢిల్లీ వెళ్ళారు. ఆయన బి.కె.డి. నాయకులతో తాను జరిపిన చర్చల గురించి ప్రధానికి వివరిస్తారు.

బి.కె.డి. నాయకుడు శ్రీ పి. ఎ. సేథ్ కూడా ఢిల్లీ వెళుతున్నారు. ఆయన అక్కడ శ్రీ త్రిపాఠీతో కేంద్ర కాంగ్రెసు నాయకులతో సంభాషణలు సాగిస్తారు.

పాకిస్తాన్ విదేశాంగ విధానానికి దేశ ప్రజల సిద్ధాంతాలు ప్రాతిపదికగా వుండాలని మాజీ మంత్రి భుట్టో సూచించినట్టు కరాచీ వార్త.

సినో-సోవియెట్ సరిహద్దు సమస్య

"పీకింగ్ చర్చలలో ఎట్టి పురోగతి లేదు"

మాస్కో సభలో ప్రధాని కోసిగిన్ ప్రకటన

మాస్కో, జూన్ 11—

చైనాతో మామూలు సంబంధాలు నెలకొల్పుకొనడానికి జరుగుతున్న కృషిలోగాని, పీకింగ్‌లో జరుగుతున్న సరిహద్దు చర్చలలో గాని ఎట్టి పురోగతిలేదని సోవియెట్ ప్రధాని కోసిగిన్ చెప్పారు.

టోల్యాయి థియేటర్‌లో ఒక ఎన్నికల సభలో ప్రసంగిస్తూ ప్రపంచ శాంతికి సోవియెట్ యూనియన్, అమెరికాల మధ్య సత్సంబంధాలుఅవసరమని ఆయన అన్నారు.

ఇండో-చైనా యుద్ధం, ఇజ్రాయెల్‌కు వాషింగ్టన్ మద్దతు దృష్ట్యా ఇటీవలకాలంలో సోవియెట్-అమెరికా సంబంధాలు మెరుగుపడడం లేదని కోసిగిన్ చెప్పారు.

అయితే అమెరికాతో సత్సంబంధాలు నెలకొల్పుకొనడం సోవియెట్ ప్రజలకు మాత్రమేగాక, మొత్తం ప్రపంచానికే శ్రేయస్కరమని క్రెమ్లిన్ విశ్వసిస్తున్నట్టు ఆయన చెప్పారు.

అమెరికాతో రాజకీయ, ఆర్థిక సంబంధాలు మెరుగుపరచుకొనడం సోవియెట్ యూనియన్‌కు మాత్రమే మంచిదని వాషింగ్టన్‌లో ఎవరైనా భావిస్తే అది పొరపాటు కాగలదని ఆయన అన్నారు.

చైనాతో సంబంధాలు కనీసం ప్రభుత్వాల స్థాయిలో మెరుగుపరచుకొనడానికి రష్యా పెక్కు సంవత్సరాలుగా కృషిచేస్తున్నదని సోవియెట్ ప్రధాని చెప్పారు.

అయితే పీకింగ్ ఇందుకు తగినట్టుగా వ్యవహరించడం లేదని ఆయన అన్నారు.

చైనా ఎన్ని చిక్కులు కలగజేస్తున్నప్పటికీ ఉభయదేశాల శ్రేయస్సు దృష్ట్యా ఒక ఒప్పందం కుదుర్చుకొనడానికి సోవియెట్ యూనియన్ చర్చలు కొనసాగిస్తున్నదని కోసిగిన్ వివరించారు.

పశ్చిమ జర్మనీతో రష్యా జరిపిన చర్చలు ప్రయోజనకరంగా వున్నవని, అయితే ఆ చర్చలవల్ల రాగల సత్ఫలితాలను భవిష్యత్తు మాత్రమే నిర్ణయించగలదని సోవియెట్ ప్రధాని వివరించారు.

ప్రత్తి ఉత్పత్తిదార్లకు గిట్టుబాటు ధరలు

ప్రత్యేక సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించినట్టు ఎ.ఐ.సి.సి. నోట్‌లో వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 11—

ప్రత్తి, జనుము ఉత్పత్తిదార్లకు గిట్టుబాటు ధరలు లభించేటట్టు చూడడానికి ప్రభుత్వం తన యాజమాన్యాన ప్రత్యేక సంస్థలు నెలకొల్పాలని సంకల్పించింది.

సోషలిస్టు లక్ష్యాల సాధనకు ఇప్పటివరకు ప్రభుత్వం గైకొన్న చర్యలపై సిద్ధపరచిన అందజేయడానికి అధికార కాంగ్రెసు ఎ. ఐ. సి. సి. కార్యాలయం రూపొందించిన పత్రంలో ఈ విషయం వెల్లడించారు.

13 వ తేదీ నుంచి ఢిల్లీలో జరగనున్న అధికార కాంగ్రెసు ఎ.ఐ.సి.సి.సమావేశంలో ఇతర విషయాలతోపాటు బొంబాయి సభ ఆర్థిక తీర్మానం అమలును గురించి కూడా చర్చిస్తారు.

భూ సంస్కరణలను త్వరితగతిని అమలు జరపడం, పట్టణ ఆస్తులపై పరిమితి మొదలు అంశాలు కూడా చర్చకు వస్తాయి.

భూ సంస్కరణలను సత్వరమే అమలు జరపవలసిన ఆవశ్యకత కలదని ఆ నోట్‌లో పేర్కొన్నారు.

జాతీయం చేసిన బ్యాంకులు పని చేస్తున్న తీరును గురించి కూడా ఈ నోట్‌లో సమీక్షించారు. ప్రభుత్వ రంగంలోని బ్యాంకులు చిన్న రైతులకు బాగా సహాయం చేస్తున్న పని స్పష్టమౌతున్నట్టు ఆ నోట్‌లో పేర్కొన్నారు.

ఆహార రంగం

ఆహార రంగంలో ఉత్పత్తిదారుల, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడడం జరుగుతున్నదని ఆ నోట్‌లో వివరించారు.

యుద్ధంలో వికలాంగులైన దాదాపు వందమంది పదవ తేదీన దక్షిణ వియత్నాం అసెంబ్లీ భవనం ముందు ప్రదర్శనలు జరిపినట్టు సైగాన్ వార్త.

తిరుపతిలో విమానాశ్రయం

పథకానికి కేంద్రం ఆమోదం ; 34 లక్షలు మంజూరు

న్యూఢిల్లీ, జూన్ 11— ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి వద్ద, కేరళలో కాలికట్ వద్ద విమానాశ్రయాలు నిర్మించడానికి పథకాలు ఆమోదించబడినాయని, త్వరలోనే పని ప్రారంభం కాగలదని తెలుస్తున్నది.

మేఘాలయలోని షిల్లాంగ్ వద్ద 6 వేల అడుగుల ఎత్తున మరొక విమానాశ్రయాన్ని నిర్మించే పథకానికి కూడా ఆమోదం లభించింది.

తిరుపతిలో విమానాశ్రయ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించవలసిన పనుల కోసం 34 లక్షల రూపాయలు మంజూరు అయినాయి.

తిరుపతి నుంచి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో విమానాశ్రయాన్ని నిర్మిస్తారు.

వచ్చే సంవత్సరం నుంచి ఇండియన్ ఎయిర్ లైన్సు విమానాలు నడుపుతుంది.

మద్రాసు, బెంగుళూరు, హైదరాబాద్‌ల నుంచి తిన్నగా విమానాలు వుంటాయి. ట్రాఫిక్ పెరిగినకొద్దీ విజయవాడ, విశాఖపట్టణం నుంచి కూడా విమానాలు నడుస్తాయి.

ప్రధాని ఇందిరకు సహనౌక్ సందేశం

న్యూఢిల్లీ, జూన్ 11 — ప్రిన్స్ నరోదమ్ సిహనౌక్ నాయకత్వాన గల కంబోడియా ప్రవాస ప్రభుత్వంలో విదేశాంగ మంత్రిగా వున్న శ్రీ శరీన్‌ఛక్ నిన్న రాత్రి ప్రొద్దుపోయిన తర్వాత ఇక్కడికి చేరుకున్నారు.

ఆయన ప్రిన్స్ సిహనౌక్ నుంచి ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధికి ఒక సందేశాన్ని తీసికొని వచ్చారు.

కృతజ్ఞత

నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి శాసన పరిషత్తుకు నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నందుకు ఓటరు మహాశయులకు, సహాయపడ్డ కాంగ్రెస్ పెద్దలకు, మిత్రులకు నా కృతజ్ఞత తెలుపుతున్నాను.

గునుపాటి రామచంద్రారెడ్డి

14-6-70 ఆదివారం రాత్రి గం. 8-30 ల నుంచి గం. 10-30 వరకు

హోటల్ నటరాజ్ రూఫ్‌గార్డెన్‌లో

(ఎయిర్‌కండిషన్డ్ కాఫీ, బోర్డింగ్ అండ్ లాడ్జింగ్)

కాంగ్రెసు ఆఫీసురోడ్ — విజయవాడ-2

డిన్నరు అండ్ డ్యాన్స్

సీట్లు పరిమితం. నేడే మీ సీట్లు రిజర్వు చేసుకోండి. ఫోన్: 5271, 6 లైన్లు

రూఫ్‌గార్డెన్లో ప్రతిరోజూ సాయంత్రం 6-00 గం. నుంచి 7-30 గం. వరకు కాఫీ, ఫలహారములు సప్లయి చేయబడును

గమనిక : నాటికలు, గానకచ్చేరీలు, డ్యాన్సుల ప్రోగ్రాం యిచ్చేవారు ఏయే ప్రోగ్రాం యిస్తారో, మీ రేటు తీసుకుంటారో అడ్రసుతో సహా వివరములు పంపవలసినదిగా కోరుచున్నాము.

1970 జూన్ 12 శుక్రవారం
శ్రీ సాధారణనామ సంవత్సర జ్యేష్ఠ శు॥ అష్టమి
అష్టమి: రా॥ 10-37 పుబ్బ: ఉ॥ 8-15
వర్జ్యం: సా॥ 4-12 నుంచి 5-58 వరకు

1970 జూన్ 13 శనివారం
శ్రీ సాధారణనామ సంవత్సర జ్యేష్ఠ శు॥ నవమి
నవమి: రా॥ 12-11 ఉత్తర: ఉ॥ 10-45
వర్జ్యం: రా॥ 7-48 నుంచి 9-31 వరకు

ఆంధ్రజ్యోతి

"తమసోమా జ్యోతిర్గమయ"

కాశ్మీర్ సదస్సు

శ్రీనగర్‌లో మొన్న జరిగిన కాశ్మీర్ ప్రజా సదస్సును కేవలం మరొక తప్పుడు సమావేశంగానే పరిగణించాలి. కాశ్మీర్ సమస్యకు పరిష్కారాన్ని కనుగొనే మహదాశయంతో షేక్ అబ్దుల్లా ఈ సదస్సును జరిపించాడు. 1968 లో ఇట్టి సదస్సు మొదటిసారి జరిగింది. ఇది రెండవ సదస్సు. ఆ సదస్సు ఎంత ప్రయోజనకరంగా జరిగిందో ఇదీ అంతే.

కాశ్మీర్ వివాదం ముగిసినట్లుగా షేక్ అబ్దుల్లా భావించడంలేదు. ఇండియాలో దాని చేరికను ఒప్పుకు తానె సమర్థించిన విషయాన్ని విస్మరించి, దాన్ని ఇప్పటికీ పరిష్కారంకాని సమస్యగా పరిగణిస్తున్నాడు. ఎటొచ్చీ, ఆయన మాటలలో పూర్వపు ఉద్ధతి, ఉధృతి లేవు. ఇప్పుడు ఆయన తన స్వరాన్ని కొంత తగ్గించి మాట్లాడుతున్నాడు. అంతే తేడా.

కాశ్మీర్ వివాదానికి పరిష్కారాన్ని కనుగొనాలని ప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తూ, అట్టి పరిష్కారం ఇండియా, పాకిస్తాన్‌లు రెండింటికీ ఆమోదయోగ్యం కావలెనని అబ్దుల్లా సూచించాడు. ఇది కేవలం గొంతెమ్మ కోర్కె తప్ప మరొకటి కాదని ఆయనకు తెలియదా?

పాకిస్తాన్ కాశ్మీర్‌ను పూర్తిగా హస్తగతం చేసుకో గోరుతున్నది. ఇండియా కాశ్మీర్ తన అంతర్భాగంగా భావిస్తున్నది. ఈ రెండు విరుద్ధ వైఖరులకు సమన్వయం సాధ్యమైతే ఈ సమస్య ఎన్నడో పరిష్కారమై వుండేది కాదా? అట్టి సమన్వయం ఇష్టం లేకనే కదా పాకిస్తాన్ రెండుసార్లు కాశ్మీర్‌పై దురాక్రమణకు తలపడింది?

ఏ పరిష్కారమైనా ఇండియా, పాకిస్తాన్‌లు రెండింటికీ ఆమోదయోగ్యం కావాలని సదస్సులో ఒక రోజున మాట్లాడిన అబ్దుల్లా, మరొక రోజున తాను ప్లెబిసైట్ ద్వారా పరిష్కారాన్ని కోరుతున్నట్టు చెప్పాడు. ఒకప్పుడు ప్లెబిసైట్‌ను ఇండియా అంగీకరించిన మాట నిజమే. కాని, పాకిస్తాన్ ప్రవర్తన కారణంగా, తాను దురాక్రమణ చేసిన కాశ్మీర్ భూభాగాన్ని అది విడిచిపోవాల్లని కారణంగా ఇండియా ప్లెబిసైట్ ప్రతిపాదనను ఏనాడో తిరస్కరించింది. ఒక పక్షానికి—ఇండియాకు—ఏ మాత్రం ఆమోదయోగ్యం కావని స్పష్టమైపోయిన ప్లెబిసైట్ వాదాన్ని తిరిగితిరిగి చేయడంలో అబ్దుల్లా అంతర్యమేమో అతనికే తెలియాలి.

సదస్సులో మాట్లాడిన ఇతర వక్తలు కూడా కాశ్మీర్ సమస్యకు ఆచరణయోగ్యమైన పరిష్కారమార్గాన్ని ఒక్కటైనా సూచించలేకపోయారు. కాశ్మీర్‌ను స్వతంత్ర రాజ్యంగా చేయాలన్నది వారి వాదసారాంశం. ఇందుకు సమర్థనగా వారు చేసిన వాదాలలో ఏ ఒక్కటీ తర్కానికి నిలవదు.

వీటిలో ఒక వాదం ప్రకారం కాశ్మీర్ యుగయుగాలుగా స్వతంత్ర రాజ్యంగా వుంటూ వచ్చినదట. దాని సంస్కృతి వేరట. దాని ప్రజల జీవన విధానం వేరట. ఈ వాదాన్ని అంగీకరిస్తే ఇండియా ఒక దేశంగా మరి మిగలదు. ఒకప్పుడు ఇండియాలో యాభై అరు స్వతంత్ర రాజ్యాలుండేవి. కాశ్మీర్ ప్రజల కున్నపాటి సాంస్కృతిక, జీవన విధాన ప్రత్యేకత వాటిలో ప్రతి రాజ్యంలోను వుండేవి. కాశ్మీర్‌ను స్వతంత్ర రాజ్యంగా చేయాలన్న వాదాన్ని అంగీకరిస్తే ఆయా ప్రాచీన రాజ్యాల ప్రాంతాలను కూడా స్వతంత్ర దేశాలుగా అంగీకరించవలసివాదా?

ఏమైనా, షేక్ అబ్దుల్లా నిర్వహించిన ద్వితీయ "ప్రజాసదస్సు" కాశ్మీర్ సమస్యా పరిష్కారానికి చేయగల దోహదం అంటూ లేదు. దాన్ని ప్రజాసదస్సుగా అంగీకరించడం కూడా సాధ్యం కాదు. షేక్ అబ్దుల్లా, ఆయన అనుచరులు, వారివలెనే ఏవేవో కారణాలవల్ల కాశ్మీర్ విలీనీకరణతో అసంతృప్తి చెందిన వ్యక్తులు మాత్రమే కాశ్మీర్ ప్రజలు కారు. వారుగాక కాశ్మీర్ ప్రజలు ఇంకా వున్నారు. వారు కాశ్మీర్ విలీనీకరణను ప్రశ్నించడంలేదు. దాన్ని తిరగదోడాలని వారు కోరడంలేదు. అయినప్పుడు మొన్నటి సమావేశాన్ని ప్రజాసదస్సుగా పరిగణించడానికే వీలులేదు.

షేక్ అబ్దుల్లా కొంత కాలంగా మరుగున పడి వున్నాడు. ఆయన పలుకుబడి పూర్వంపంతగా లేదు. ఆయనను మరొకసారి వెలుగులోనికి తీసుకురావడానికి మొన్నటి సదస్సు తోడ్పడిందేమోతప్ప, అది సాధించిన ఘనకార్యం, కనుగొన్న పరిష్కారం ఏమీ లేదు.

వరి నారు తెగులుకు మందులు

శ్రీ కాకాని ప్రకటన

విజయవాడ, జూన్ 11—డెల్టా జిల్లాలో వరినారుకు పట్టిన "హిస్పా" అనే బాటాకు తెగులు ఎదుర్కొనడానికి నిపుణులు మందులను కనుగొన్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ కాకాని వెంకటరత్నం నేడిక్కడ చెప్పారు. వాటిని వెంటనే ఉపయోగించవలసిందిగా రైతులకు విజ్ఞప్తి చేశారు.

మంత్రి శ్రీ కాకాని తమ ప్రకటనలో ఈ క్రింది విధంగా పేర్కొన్నారు:

"కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలలో వరి నారుమళ్ళపై వ్యాపించిన బాటాకు తెగులు నివారణకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు వరి నారుమళ్ళపై ప్రయోగించిన మందుల ఫలితాలు తేలాయి.

నూటికి 80-90 వంతులు వరి ఆకుపై గూడు కట్టకొని వున్న తెగులు క్రిములు 48 గంటలలో సర్వనాశనమయిపోయినట్టు వారి పరిశోధనల వల్ల తేలినది.

పశ్చిమ గోదావరి జిల్లా విస్సాకోడేరు లోను, కృష్ణాజిల్లా కంకిపాడు అవనిగడ్డ లోను వరినారు మడులమీద ప్రయోగించిన మందుల ఫలితాలు తేలాయి. నూటికి 90 వంతులు క్రిమి సంహారం జరిగిన మందులను రైతులందరు సత్వరమే వరి నారు మళ్ళమీద ఉపయోగించి "హిస్పా" తెగులునుంచి రక్షించుకోవలసిన అవసరం ఎంతో వున్నది.

ఆ మందులు వ్యవసాయ శాఖవారివద్ద కాని, లేక ఇతర్రా కాని లభిస్తాయి.

మూడు రకాల మందులు వున్నాయి. వీటిలో "పారథియాన్" అనే మందునుఉపయోగించడంలో ఒళ్లేవారికి ప్రమాదం వున్నది.

"మలాథియాన్" అనే మందును చల్లడానికి వరినారుమడి ఎకరాకు ఒకనారికి అరు లేక ఏడు రూపాయలకంటె ఎక్కువ ఖర్చు కాదు.

"సుమిథియాన్" అనే మందు దాదాపు పది మంచి ఎదకొండు రూపాయలవరకు కావచ్చు.

రెండింటిలో దేనినైనా వాడవచ్చు.

రైతులకు ఏది అందుబాటులో వుంటే దానిని వెంటనే కొనివాడవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

"మలాథియాన్" అనే మందు పది ఔన్సులు 30 గ్యాలన్ల నీటిలో కలిపి చల్లాలి. ఒకసారి వాడిన తరువాత పరిశీలనలోకి తీసుకొని పూర్చ్వడానికి రెండు రోజులు ముందు ఆ విధంగానే మరొక పర్యాయం ఉపయోగిస్తే నాటిన వరిపైరుకు "హిస్పా" నుంచి రక్షణ కలుగుతుంది.

వరి నాటిన పొలం గట్లమీద కూడా ఈ మందును చల్లడం చాల శ్రేయస్కరం.

చీడ తీక్షణత ఎక్కువగా వుంటే ఈ మందును రెండు ఔన్సులు మూడు గ్యాలన్ల నీటితో కలిపి ఎకరాకు 20 ఔన్సుల మందు చల్లవచ్చు.

"సుమథియాన్'' మందు ,పది ఔన్సులు 30 గ్యాలన్ల నీటితో కలిపి చల్లవలసి వుంటుంది ''

ప్రధాని ఇందిరతో డి.పి. మిశ్రా భేటీ

న్యూఢిల్లీ, జూన్ 11— మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ డి. పి. మిశ్రా ప్రధాని శ్రీమతి ఇందిరతో నిన్న చర్చలు జరిపారు.

సుమారు అరగంటసాగిన ఈ చర్చలలో వారు పార్టీ వ్యవహారాలను, దేశంలో మత కల్లోలాలను నివారించడానికి తగిన చర్యల గురించి చర్చించినట్లు తెలుస్తున్నది.

ఆర్. యస్. యస్. పై నిషేధాన్ని ఎత్తివేయడానికి ముందు ఆ పార్టీ ప్రభుత్వానికి ఇచ్చిన హామీలను తీర్చిందా లేదా అన్న అంశంపై ఒక జడ్జీ నిర్ణయం ఇచ్చే వరకు ఆర్. యస్. యస్. ను నిషేధించే సమస్యను పరిశీలించరాదని శ్రీ మిశ్రా అభిప్రాయపడినట్లు తెలుస్తున్నది.

కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు

మద్రాసు, జూన్ 11—కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు మూడు రోజుల సమావేశం, చైర్మన్ శ్రీ ఎం. డి. భట్ అధ్యక్షతన నిన్న ఇక్కడ ప్రారంభమైంది.

తొమ్మిది మంది సభ్యులలో ఎనిమిది మంది బోర్డు సమావేశానికి హాజరైనారు.

నేటి చర్చలు ప్రాథమికమైనవని తెలుస్తున్నది.

వచ్చే ఎన్నికలు: కొత్త కాంగ్రెసు ఎత్తుగడలు

జనరల్ ఎన్నికల వాతావరణం అప్పుడే ప్రారంభమైనది. అందువల్ల రాజకీయ పక్షాల దృష్టి అప్పుడే ఎన్నికలపై లగ్నమైంది. పదిహేను మాసాల నాటికి ఎన్నికల ప్రచారం ఉధృత రూపంలో వుంటుంది.

లోకసభకు జరిగే ఎన్నికలు చాల ముఖ్యమైనవి. ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, హర్యానా—ఈ నాలుగు రాష్ట్రాలు మినహాయించి మిగిలిన రాష్ట్రాలన్నింటిలో జనరల్ ఎన్నికలు జరుగుతాయి. ఈ నాలుగు రాష్ట్రాలలో ఇటీవలనే మధ్యంతర ఎన్నికలు జరిగాయి కదా! అధికార కాంగ్రెసు కోరితే ఈ నాలుగు రాష్ట్రాలలో కూడా కొత్తగా ఎన్నికలు జరుగుతాయి.

పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలనను మరొక పద్దెనిమిది మాసాలపాటు పొడిగించవచ్చు. మిగిలిన రాష్ట్రాలలో రాజకీయ అనిశ్చిత పరిస్థితి ఏర్పడినందున అక్కడి అసెంబ్లీల రద్దు జరగవచ్చు కాని, కేంద్రంలో ఏర్పడే ప్రభుత్వ వ్యవస్థ ఎలా వుంటుందన్న దానిపైనే మన దేశం, ప్రపంచం ఆసక్తి చూపుతాయి. ఏ ఒక్క పార్టీకైనా కేంద్రంలో సంపూర్ణమైన మెజారిటీ వస్తుందా? లేక మిశ్రమ ప్రభుత్వం ఏర్పడడం అవసరమవుతుందా? అయితే, ఏ పార్టీల మధ్య? కేంద్రంలో మిశ్రమ ప్రభుత్వం ఏర్పడితే అది దేశ సమైక్యానికి భంగం కలిగించగలదన్న విషయాన్ని ఎవరు కాదనరు.

రాజకీయమైన పొత్తులకు, కార్యక్రమాలకు రాజకీయ పక్షాలు అన్వేషణ జరుపుతున్నాయి.

మొన్నటివారం ఢిల్లీలో జరిగిన అధికారకాంగ్రెసు నాయకుల సమావేశం రెండు ప్రయోజనాలను వుద్దేశించినటిది. సాధారణంగా మాట్లాడడానికి అవకాశం దొరకనివారు కార్యక్రమాలు, విధానాల నిర్ణయంలో తమ అభిప్రాయాన్ని కూడా పరిగణిస్తున్నారన్న సంతృప్తి కలుగుతుంది. రెండవది—సంస్థ, పరిపాలనా విభాగాలకు చెందినవారు కలిసిమెలిసి సమస్యలను చర్చించడానికి ఇది ఒక అవకాశం కల్పించింది. ఇలాంటి సమావేశాలను రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ఏర్పాటుచేయాలన్నది కేంద్రంలోని కొత్త కాంగ్రెస్ నాయకుల వుద్దేశం. బొంబాయి ఏ. ఐ. సి. సి. సమావేశంలో ఆమోదించిన కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం అమలుపరచడంలేదని విమర్శించడానికి యంగ్‌టర్క్స్‌కు ఇది అవకాశం కల్పించింది.

శ్రీ సుబ్రహ్మణ్యం తమాషా

మాజీ ఆహార మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం కూడా ఇలాంటి విమర్శన చేశారంటే, ఆయన కూడా యంగ్‌టర్క్ అయ్యారని దీని అర్థం కాదు.

ప్రధాని తన ప్రభుత్వ విధానాలను సమర్థించారు. అభివృద్ధికి అడ్డుగోడలు లేవని, త్వరగా అభివృద్ధి సాధించడానికి అంతర్గతమైన చిక్కులు కలవని ఆమె చెప్పారు.

న్యూఢిల్లీ లేఖ

వచ్చే ఎన్నికల విషయంలో ఇతర పార్టీలతో సర్దుబాట్లు విషయంలోను పార్టీ కార్యక్రమాలు, విధానాలు, ఎత్తుగడల విషయంలోను వ్యవహరించడానికి ఒక ఉన్నతాధికార సంఘాన్ని నియమించవలెనన్న సూచన వచ్చింది. ఇతరులతో నిమిత్తం లేకుండా అధికారంలో వుండవలెనన్న ఏ పార్టీ కూడా తాను ఏయే పార్టీలతో పొత్తు పెట్టుకోదలచిందో ఎన్నికలకు ముందుగా ప్రకటించదు. ఎందువల్లనంటే, అలా ప్రకటిస్తే ఆ పార్టీకి తన విజయంలో విశ్వాసం లేదన్న అర్థం వస్తుందిగదా! తనలో తనకే విశ్వాసంలేని పార్టీ దేశాన్ని నడిపించగలదని ఎలా భావించగలం? అధికార కాంగ్రెసు పార్టీ నాయకులుకాని, ఇతర పార్టీ నాయకులు కాని వచ్చే ఎన్నికలలో కేంద్రంలో ఏ పార్టీకి మెజారిటీ రాదన్న అభిప్రాయంతోనే వున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతిపార్టీ కూడా — పైకి చెప్పకపోయినా— తన వలె ఆలోచించే పార్టీలతో పొత్తు విషయం పరిశీలించక తప్పదు. అధికారంలో వున్న పార్టీ ఏ పార్టీతో మిశ్రమ ప్రభుత్వానికి లేదా పొత్తుకు అంగీకరిస్తుంది? ప్రస్తుతానికి దీనికి "ఏ పార్టీతోను లేదు" అని సమాధానం చెప్పవలసి వుంది.

అతి తీవ్రవాదులతోను, అభివృద్ధి విరోధక మితవాద శక్తులతోను పోరాడాలని బొంబాయి ఏ. ఐ. సి. సి. సమావేశంలో నిర్ణయించబడింది. అభివృద్ధి విరోధక మితవాద శక్తులంటే స్వతంత్ర, జనసంఘం, ప్రతిపక్షకాంగ్రెసులని, కొత్తకాంగ్రెసు వారి వుద్దేశం. ప్రతిపక్ష కాంగ్రెసును స్వతంత్ర, జనసంఘం పార్టీలతో కొత్త కాంగ్రెసు జమకట్టినప్పటికీ ప్రతిపక్ష కాంగ్రెసు సభ్యులు తమతో ఎలాంటి షరతులు లేకుండా చేరితే కొత్త కాంగ్రెసుకు ఎలాంటి అభ్యంతరం లేదు.

ఇక అతి తీవ్రవాదులంటే ఎవరో నిర్వచించవలసిందిగా కోరగా, ఎవ్వరు జవాబు చెప్పలేదు.

కాని, ఇప్పుడు కేరళలోను, బెంగాల్‌లోను అతివాద కమ్యూనిస్టు ప్రభుత్వాలు పడిపోయినందున కొత్తకాంగ్రెసువారు ఇప్పుడు తీవ్రవాద శక్తులంటే నక్సలైట్లు, మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీలని ఇటీవల ఒక నివేదికలో నిర్వచించారు. ఆ నివేదికలో ఇలా వుంది:

"పశ్చిమబెంగాల్‌లో దౌర్జన్యం, భయోత్పాతం మామూలు విషయాలైపోయాయి. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో ముఖ్యంగా మార్క్సిస్టుల ఆధ్వర్యంలో ఈ శక్తులు దౌర్జన్యానికి సంబంధించిన చాలా కేసులకు కారణమయ్యాయి. శాంతి భద్రతలు రాష్ట్రంలో నశించిపోయాయి. రాష్ట్ర ప్రజలలో భద్రతాభావం నశించింది. రాజకీయ హత్యలు ప్రతిరోజు జరుగుతున్నాయి." ఆ నివేదికలో ఇంకా ఇలా వుంది:

"మార్క్సిస్టుపార్టీ కాక మరొక పార్టీ వుంది—దాని పేరు నక్సలైట్ల పార్టీ. ఈ పార్టీలోనివారు విద్యాసంస్థలను, ఆసుపత్రులను విధ్వంసం చేయడానికి యత్నిస్తున్నారు. గాంధీ, టాగోర్ చిత్రపటాలను వారు విధ్వంసం చేస్తున్నారు. తమకు వ్యతిరేకమైన రాజకీయాభిప్రాయాలుగల కార్మికులను హత్యచేయడానికి వారు వెనుదీయడంలేదు. భూమిలేని పేద రైతుల కోసమే తాము ఇదంతా చేస్తున్నట్టు వారు చెబుతారు"

దీన్ని శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యగా పరిగణించి, వ్యవహరించాలని ఈ నివేదికలో ప్రభుత్వం అర్థించబడింది. ఈ శక్తులకు ప్రోత్సాహమిస్తున్న అంశాలను మన ఆర్థిక, సాంఘిక జీవితం నుంచి తొలగించాలనికూడా కోరబడింది. కార్మిక విప్లవం విషయంలో మావోభాష్యాన్ని ఆమోదించే కమ్యూనిస్టు ఉద్యమ శాఖగా ఈ నక్సలైట్లను ఈ నివేదికలో పేర్కొనడం జరిగింది. (సశేషం)

— కె. రంగస్వామి.

ఇజ్రాయెల్‌కు అమెరికా యుద్ధ విమానాలు

వెంటనే సరఫరా చేయాలని ప్రతినిధి సభ సభ్యుల విజ్ఞప్తి

వాషింగ్టన్, జూన్ 11— ఇజ్రాయెల్‌కు అది కోరిన జెట్ ఫైటర్ విమానాలను విక్రయించాలని అమెరికా ప్రతినిధుల సభలోని మెజారిటీ సభ్యులు నిన్న ప్రెసిడెంట్ నిక్సన్‌కు విజ్ఞప్తి చేశారు.

ప్రెసిడెంట్ నిక్సన్‌కు ఈ మేరకు వ్రాసిన లేఖపై డెమొక్రటిక్ రిపబ్లికన్ అగ్ర నాయకులతో సహా 47మంది సంతకాలు చేశారు.

పశ్చిమ ఆసియాలో సోవియట్ యూనియన్ సైనిక జోక్యం వల్ల ఏర్పడిన ప్రమాదాన్ని ఎదుర్కొనడానికి అమెరికా ఖచ్చితమైన చర్య గైకొనవలసిన సమయం ఆసన్నమైనదని వారు పేర్కొన్నారు.

తమపై దురాక్రమణను ఎదుర్కొనడానికి ఇజ్రాయెల్‌కు అవసరంగా సూపర్‌సానిక్ విమానాలను సరఫరా చేయాలని ఆయన చెప్పారు.

సెనేట్‌లో కూడా మెజారిటీ సభ్యులు అదే లేఖనే అమెరికా విదేశాంగ మంత్రి విలియమ్ రాజర్స్‌కు పంపారు.

ఇజ్రాయెల్‌వారికి 125 ఫైటర్ బాంబర్లను సరఫరా చేసేది లేనిదీ అమెరికా ఈ వారాంతంలోపుగా ప్రకటించగలదని విలియమ్ రాజర్స్ నిన్న పునరుద్ఘాటించారు.

అంకార్ దేవాలయాలు హనోయ్ సేనల స్వాధీనం

సీమ్‌రీప్, జూన్ 11— ఇక్కడికి నాల్గు మైళ్ళ దూరంలోవున్న చరిత్ర ప్రసిద్ధమైన అంకార్ దేవాలయాలు నిన్న ఉత్తర వియత్నాం సైనికుల స్వాధీనమైనట్లు ప్రకటించారు.

పాథెట్‌లావో సేనల సహాయంతో హనోయ్ సేనలు ఈ దేవాలయాలను ఆక్రమించుకొని, వాటిమీదు మర ఫిరంగులను వుంచారు.

అయిదు రోజుల భీషణ సమరం తర్వాత కూడా అక్కడ పరిస్థితి ప్రమాదకరంగా వున్నది.

సియాంరీప్ విమానాశ్రయం కంబోడియా సేనల స్వాధీనం

సియాంరీప్ విమానాశ్రయం కంబోడియా సేనల స్వాధీనమైనది. అక్కడ ఇప్పుడు కంబోడియా విమానాలు దిగుతున్నవని నామ్‌పెన్‌లో అధికార రీత్యా ప్రకటించారు.

అక్కడ గత వారం రోజులుగా జరిగిన పోరాటంలో 40 మంది గెరిల్లాలు మరణించారు.

అయితే, నామ్‌పెన్‌కు వాయవ్య దిశగా 25 కిలోమీటర్ల దూరంలో ఇప్పటికి అరు వేలమంది ఉత్తర వియత్నాం, వియత్కాంగ్ సైనికులు వున్నట్లు సైనిక వర్గాలవారు చెప్పారు.

కంబోడియా సైనికవిమానాలు సియాంరీప్ విమానాశ్రయానికి ఆయుధాలను చేరవేస్తున్నవి.

కంబోడియాలో శాంతి సాధన సమస్య

జకర్తా సభ ప్రతినిధివర్గంతో చర్చలకు మాస్కో తిరస్కృతి

జకర్తా, జూన్ 11— కంబోడియా సమస్యపై జకర్తాలో జరిగిన ఆసియన్ రాజ్యాల సభ ప్రతినిధి వర్గాన్ని తాము కలుసుకొనబోమని సోవియట్ యూనియన్ నిన్న ఇండొనేషియాకు తెలియచేసింది.

ఈ విషయాన్ని సోవియట్ రాయబారి ఇండొనేషియా విదేశాంగ మంత్రి ఆడమ్‌మాలిక్‌కు స్పష్టం చేశారు.

జకర్తా సభ మలేసియా ఇండొనేషియా, జపాన్‌లతో ఏర్పాటుచేసిన ఉపసంఘం జూన్ 20వ తేదీన మాస్కోలో సోవియట్ నాయకులతో చర్చలు జరపాలని నిర్ణయించింది.

జకర్తా సభ నిర్ణయాలను గురించి కాని, దాని అభ్యర్థనలను గురించి కాని తాము చర్చించజాలమని ఇండొనేషియాకు సోవియట్ యూనియన్ స్పష్టం చేసింది.

మధ్యప్రదేశ్‌లో జనసంఘం ఓటమి

శ్రీ వాజ్‌పాయ్ విస్మయం

డెహరాడూన్, జూన్ 11— మధ్యప్రదేశ్ ఉప ఎన్నికలలో జనసంఘం పరాజయాలను ఎదుర్కొన్నందుకు పార్టీ అధ్యక్షుడు శ్రీ వాజ్‌పాయ్ విస్మయాన్ని ప్రకటించారు.

దీని అర్థం పార్టీ పలుకుబడి పోయినట్లు కాదా అని ఒక విలేకరి అడుగగా 'జనాలా ఓటర్లు ఎప్పుడూ మార్పు కావాలని అనుకుంటారేమో'' అని శ్రీ వాజ్‌పాయ్ అన్నారు.

ఆయన ఇక్కడ ఒక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కమ్యూనిస్టులను ప్రతిఘటించడానికి ఇష్టపడే అన్ని ప్రజాస్వామిక జాతీయవాద పార్టీలతో ఎన్నికల ఒప్పందం చేసుకొనడానికి సిద్ధంగా వున్నట్లు చెప్పారు.

కనీస కార్యక్రమం ప్రాతిపదికపై ఎస్. ఎస్. పి. తో గాని ప్రతిపక్ష కాంగ్రెసులో గాని పొత్తుపెట్టుకొనే అవకాశాలు లేకపోలేదని జనసంఘం అధ్యక్షుడు చెప్పారు.

ఈ రకమైన పొత్తు రాష్ట్రం నుంచి రాష్ట్రానికి నియోజకవర్గం నుంచి నియోజకవర్గానికి మారుతుందని శ్రీ వాజ్‌పాయ్ అన్నారు.

మతాల ప్రాతిపదికపై పనిచేసే పార్టీలను నిషేధించడానికి అనుసరిస్తారా అని అడుగగా ఏ పార్టీనైనా నిషేధించవలసివస్తే అది పీకింగ్ మద్దతుగల కమ్యూనిస్టుపార్టీనే నని ఆయన చెప్పారు.

జనసంఘం మతం ప్రాతిపదికపై పనిచేస్తున్న పార్టీ కాదని శ్రీ వాజ్‌పాయ్ ఉద్ఘాటించారు.

చాలా మంది ఆర్. ఎస్. ఎస్. స్వయం సేవకులు తమ పార్టీ సభ్యులే అయినా తమకు ఆర్. ఎస్. ఎస్. తో ప్రత్యక్ష సంబంధాలు లేవని అన్నారు.

విలేకరి: మీరు సవతి సోదరులు కదా.

వాజ్‌పాయ్: కాదు ఏకోదరులమే.

సింహళంలో అధిక విలువగల కరెన్సీ నోట్ల రద్దు?

కొలంబో, జూన్ 11— సింహళంలో హెచ్చు విలువగల కరెన్సీ నోట్లను రద్దుచేయనున్నారు?

వంద, యాభై రూపాయల నోట్లను చిన్న మొత్తాల నోట్లలోకి మార్చుకుని నిమిత్తం వాణిజ్య బ్యాంకులలో ప్రజలు విపరీతంగా గుమిగూడుతున్నట్లు "సిలోన్ టైమ్స్'' పత్రిక నిన్న ఉదయం ప్రకటించింది.

పెక్కు పంచాయతీలకు కొత్త సర్పంచ్‌ల ఎన్నిక

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

బందరు, జూన్ 11—కృష్ణాజిల్లా మొవ్వ సమితి పంచాయతీలకు ఈ కిందివారు సర్పంచ్‌లుగా ఎన్నికైనట్టు ప్రకటించారు:

నిడుమోలు: శ్రీ మాదిరాజు వెంకటధనరావు. కూచిపూడి: శ్రీ ఏలేశ్వరపు కనకదుర్గాప్రసాదరావు. శ్రీకాకుళం: శ్రీదుమలశెట్టి కుమారస్వామి. తెలగరావుపాలెం: శ్రీ కొల్లిపర వెంకటకృష్ణయ్య. ఘంటసాల: శ్రీ గొర్రెపాటి బుల్లియ్య చౌదరి.

పెదప్రోలు: శ్రీ మురాల రాఘవయ్య. మంగళాపురం: శ్రీ చంద్ర ఉమామహేశ్వరరావు. గూడపాడు: శ్రీ గుత్తా వెంకటేశ్వరరావు. మద్దిపట్ల: శ్రీ కాటగడ్డ సత్యనారాయణరావు. అయ్యంకి: శ్రీ రాటకంపాటి రామమోహనరావు. కాజ: శ్రీ మద్దిరాజు నాంచారరెడ్డి. మల్లంపల్లి: శ్రీ మదుగుల వెంకట సుబ్బారావు. పెదరాయుడుతోట: శ్రీ బత్తిన రామస్వామి. చినకళ్ళేపల్లి: శ్రీ గురింపల్లి యోస్, కొండవరం: శ్రీ గద్దెంనేని వెంకయ్య. లక్ష్మీపురం: శ్రీ మూల్పూరి వెంకటేశ్వరరావు.

వేములమడి: శ్రీ చప్పిడి వెంకటరత్నం, కొత్తపల్లి: శ్రీ తుమ్మల కుటుంబరామయ్య. పిడిసనగల్లు: శ్రీ సూరపనేని పద్మనాభయ్య. భట్లపెనుమర్రు: శ్రీ చలసాని వెంకటాద్రి. భోగిరెడ్డిపల్లి: శ్రీపింగళి వెంకటాచల పూర్ణ వీరప్రసాద్. చినముత్తేవి: శ్రీ సంకర నాగేశ్వరరావు. అయినంపూడి: శ్రీ కుంచెటి రామారావు. నిడుముదురు: శ్రీ మాలెంపాటి శ్రీరాములు. యార్లగడ్డ: శ్రీ యార్లగడ్డ సుబ్బయ్య. మాజేరు: శ్రీ తుమ్మల కృష్ణమూర్తి. చిట్టూరు: శ్రీ గుత్తి గోపాలరావు.

పెదముత్తేవి: శ్రీమతి వడ్లమూడి అనసూయ, అవురుపూడి: శ్రీ బొర్రా దుర్గయ్య. ఘంటసాలపాలెం: శ్రీ తుమ్మల వెంకటరత్నం, తాడేపల్లి: శ్రీ దండమూడి మోతీలాల్, వేమరకోట: శ్రీ దోలెం నాగేశ్వరరావు. అద్దంపాలెం: శ్రీ యద్లపల్లి ఆదినారాయణ. వేములపల్లి: శ్రీ నలూరి రామారావు. మంత్రిపాలెం: శ్రీ దానేపూడి చినవెంకటసుబ్బయ్య. అముదాలలంక: శ్రీమన్నె వెంకటకృష్ణారావు. చిలకలపూడి: శ్రీ వీర్ల ధర్మరాజు. రామన్నపేట: శ్రీ తంగిరాల వీరరాఘవరావు. పూషడం: శ్రీ చిదేపూ గోవిందరాజులు.

కోసూరు: శ్రీ గుత్తికొండ గోపాలరావు. బంకపల్లి: శ్రీ వీరమాచనేని అంజనీడు అనే అంకం రామస్వామి. వి. రుద్రవరం: శ్రీ వెలిగళ్ళ అప్పారావు. ఎండకుదురు: శ్రీ కోసూరు నాగేశ్వరరావు. దాలిపర్రు: శ్రీ యార్లగడ్డ యుగంధర కోటీశ్వరరావు. మొవ్వపాలెం: శ్రీ దేవులపల్లి శేషారావు. చిట్టూర్పు: శ్రీ వడమూరి రత్నగిరిరావు. మొవ్వ: శ్రీ మండవ వెంకటజనవర్ధనరావు. పురిటిగడ్డ: శ్రీ వడుచూరి నాగేశ్వరరావు.

పెదకళ్ళేపల్లి: శ్రీ అరజా కృష్ణమూర్తి. పాపవినాశనం: శ్రీ ఘంటా రామచంద్రరావు. యద్దనపూడి: శ్రీ దామెర్ల శ్రీహరిరావు. గొగినేనివారి పాలెం: శ్రీ అట్లూరి అంజనేయులు. పెదపూడి: శ్రీయద్నం చలపతిరావు.

గుండేడు

హుజూరాబాద్, జూన్ 11— కరీంనగర్‌జిల్లా హుజూరాబాద్ సమితికి చెందిన గుండేడు పంచాయతీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఈ క్రిందివారు ఎన్నికయ్యారు: శ్రీ వి. పాండురంగారావు సర్పంచ్. శ్రీ చికిలే మల్లయ్య ఉపసర్పంచ్. సభ్యులు: సర్వశ్రీ డి. ముకుందరావు, జి. లింగయ్య వి. రాధాకృష్ణ, ఆదుసూరి పోచయ్య, శ్రీమతి వి. సుజాత దేవి.

శ్రీ వి. పాండురంగారావు సర్పంచ్‌గా మూడవసారిగా ఎన్నికయ్యారు.

శ్రీ కె. కేశవరావు ఎన్నికల కార్యక్రమాన్ని నిర్వహించారు.

హుజూరాబాద్

హుజూరాబాద్ పంచాయతీ సర్పంచ్‌గా శ్రీ జగన్నాథ నాయుడు తిరిగి ఎన్నికయారు. [illegible] ఎన్నికయారు.

నందిగామ

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

పత్తెనపల్లి, జూన్ 11—గుంటూరుజిల్లా పిరంగిపురం సమితికి చెందిన నందిగామ పంచాయతీకి సర్పంచ్‌గా ఆళ్ళ వెంకటనాయుడు, ఉపసర్పంచ్‌గా మక్కెన లింగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పోటీ తీవ్ర ప్రచారాలతో జరిగినది. అదనపు పోలీసు సిబ్బంది కూడా బందోబస్తుకై వచ్చినది. ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

వినుకొండ

("ఆంధ్రజ్యోతి' విలేకరి)

వినుకొండ, జూన్ 11— ఎలక్షను ఆఫీసరు శ్రీ కె. సత్యనారాయణ ఏర్పరచినపంచాయతి ప్రత్యేక సమావేశంలో జనాబ్ పిరాన్ ఖాసింఖాన్‌ను సరపంచిగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. జనాబ్ పిరాన్ ఖాసింఖాన్ అధ్యక్షతన జరిగిన పంచాయతీ ప్రత్యేక సమావేశంలో శ్రీ ఈలిసెట్టి శివయ్యను ఉప సర్పంచిగా ఎన్నుకొన్నారు.

గిద్దలూరు సమితి

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

గిద్దలూరు, జూన్ 11—ఒంగోలు జిల్లా గిద్దలూరు సమితిలోని 40 పంచాయతీలలో ఈ కింద పేర్కొన్న 39 పంచాయతీలకు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు.

అకవీడు: శ్రీ సూరనందిరెడ్డి, బొళ్ళవీడు: శ్రీ బత్తిన రామయ్య, చినగానిపల్లి: శ్రీ పుల్లారెడ్డి, తురిమెళ్ళ: శ్రీ బి. వెంకటరంగయ్య, జే. పుల్లలచెరువు: శ్రీ పి. వెంకటరెడ్డి. అనుములపల్లి: శ్రీ సుబ్బరామయ్య, రాచర్ల: శ్రీ ఎం. వెంకటరెడ్డి.

పాలకవీడు: శ్రీ పిచికల వెంగళరెడ్డి. సోమిదేవిపల్లి: శ్రీ బి. వి. సుబ్బారెడ్డి, గడిమెట్ల: శ్రీ బి రామిరెడ్డి. యడవల్లి: శ్రీ ఎం. నారాయణరెడ్డి సత్యవోలు: శ్రీ పి. నారాయణ రెడ్డి, దద్దివాడ: శ్రీ బి. రామిరెడ్డి. కాటిచెర్ల, శ్రీ టి. బాలయ్య.

వెహోకగుండం: శ్రీ ఎ. ఎం. కోటారెడ్డి, తిమ్మాపురం: శ్రీ ఓబయ్య, గిద్దలూరు: శ్రీ డి. రంగస్వామిరెడ్డి. ఉయ్యాలపాడు: శ్రీ మస్తాన్‌రెడ్డి, గండికోట: శ్రీ పెరా నాగిరెడ్డి. సంజీవరావుపేట: శ్రీ సూరేకొటయ్య, కొత్తపేట: శ్రీ ఎం. వి. సుబ్బారెడ్డి.

కొమ్మనూరు: శ్రీ టి. వెంకటరెడ్డి, ముండ్లపాడు: శ్రీ బయ్యపురెడ్డి, కంచిపల్లి: శ్రీ వెంకటరెడ్డి, కొంగలవీడు: శ్రీ కాశిరెడ్డి. కృష్ణంశెట్టిపల్లి: శ్రీ గిరికోటారెడ్డి. అంబవరం: శ్రీ టి. ఆదెన్న, పొదలకుండపల్లి: శ్రీ రోసిరెడ్డి. సరివ: శ్రీ చెంచి రెడ్డి. బంఋపల్లి: శ్రీ కోటిరెడ్డి.

రాజుపాలెం: శ్రీ ఎస్. రంగారెడ్డి. దావీపేనిపలి: శ్రీ సి. రామయ్య. ఇడుమకల్లు: శ్రీ బి. రంగారెడ్డి. మారెవారిపల్లి: శ్రీ బి. ఎ. సుబ్బయ్య. చింతలపల్లి: శ్రీమతి మహలక్ష్మమ్మ. ఫుల్లారెడ్డిపల్లి: శ్రీ డి. కోటారెడ్డి. అల్లినగరం: శ్రీ ఎ. రామచంద్రారెడ్డి. కొంపవోలు: శ్రీ ఎం. కేశవరెడ్డి. రెడ్డిచెర్ల: శ్రీ వెంకటేశ్వరరాజు.

నల్లకుంట్ల పంచాయతీ ఎన్నికలను ఆపుచేశారు.

గిద్దలూరు పట్టణంలో ఎనిమిది వార్డులకు పోటీచేసిన రిటైర్డ్ హెల్త్ ఇన్‌స్పెక్టరు శ్రీ బి. పుల్లారెడ్డి ఏ వార్డులో కూడా గెలుపొందకపోగా, ఎడువార్డులలోను ధరావతు పోయినది.

చింతలపల్లి పంచాయతీకి అధ్యక్ష ఉపాధ్యక్షులుగా ఇద్దరు స్త్రీలను ఎన్నుకొనిన ఘనత దక్కినది.

పోలవరం గిరిజన సమితి

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

కొయ్యలగూడెం, జూన్ 11— పశ్చిమ గోదావరిజిల్లా పోలవరం గిరిజన సమితికి చెందిన 28 పంచాయతీలకు జరిగిన ఎన్నికలలో ఎనిమిది పంచాయతీలకు మాత్రం పోటీ జరిగినది. 10 పంచాయతీలకు ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి.

ఈ సమితిలోని 18 పంచాయతీలకు గిరిజనులే సర్పంచ్‌లుగా ఎన్నికైనారు. వీరిలో ఒక స్త్రీ అభ్యర్థినికూడా ఎన్నుకొన్నారు. నలుగురు గిరిజనేతరులు సర్పంచ్‌లుగా ఎన్నికైనారు.

ఈ కింది పంచాయతీలకు ఈ కింది పేర్కొన్న పేర్లవారు వరుసగా సర్పంచ్, ఉపసర్పంచ్‌లుగా ఎన్నికయారు:

పోలవరం: సర్వశ్రీ వలవల నారాయణ, కొణతాల రామచంద్రభటారయ్య. ఇటికలకోట: జారం సంపుదుడు, మాలెం బుచ్చిరెడ్డి. ఏంజరం: కెవ్వలిచెన్నారెడ్డి, మడికం రాజు. మామిడిగొంది: బొరగం పెద పెంటయ్య కురసం సోమయ్య. రాచానగిరం: ఎస్. రామన్నదొర, వెట్టి గంగరాజు. కామయ్యకుంట: వి. బాపనయ్య, కుంజం గంగరాజు. నూతిరామన్నపాలెం: పొడియం కన్నయ్య, యొడియం బోడియ్య. కొయ్యరాజమండ్రి: బానోతు చికన, ఏచ్చోడి పోతయ్య.

అచ్చయ్యపాలెం: కుంజా చెల్లయ్య. దేవు వెంకటేశ్వరరావు. చిమ్మలగూడెం: డి. వెంకటరెడ్డి, చిమ్మ సూర్యచంద్రరావు. మంగయ్యపాలెం: కె. రామిరెడ్డి, చేవలం గంగులు. కొండ్రుకోట: పూనెంచిన కనకయ్య సరసారావు అరవాలు. రత్నారిగూడెం: చింతం ఎల్లయ్య, యొడియం గిరయ్య. ముంజలూరు: అరగుంటి ఎనిమిరెడ్డి చింతల లక్ష్మరెడ్డి.

పులిరామన్నగూడెం: ఎం. వి. నిరిన్నదొర, కచ్చెల ఎర్రారెడ్డి. కోటరామచంద్రపురం: చీమల కన్నయ్య, పూనెం కన్నయ్య. ప్రగడపల్లి: గుంజపరపు రామిరెడ్డి. కొంమూటి వెంకట్రాజు. పైడిపాక: బొట్టా రామారావు, గింగుల సూర్యనారాయణ. చేగొండపల్లి: కొవ్వాసు చెల్లన్న దొర. ముచ్చిక బుల్లిదొర. తూటిగుంట: చింతలా చినవామిరెడ్డి. సరిపిక వీరాస్వామి. కొరుటూరు: శ్రీమతి కోరుకొండ రత్నమ్మ, శ్రీ చిన్న చినప్పాయి, ఎల్. ఎన్. డి. పేట: శ్రీ కొండూరి సుబ్బారావు, శ్రీ మిడియం బుచ్చెన్న. గిద్దపల్లి: ఒక్క నామినేషను దాఖలు కాలేదు కనుక ఎన్నిక జరగలేదు.

తేలప్రోలు

తేలప్రోలు, జూన్ 11— కృష్ణాజిల్లా తేలప్రోలు పంచాయతీ సర్పంచ్‌గా శ్రీ తియ్యగూర లక్ష్మిరెడ్డి, ఉపసర్పంచ్‌గా శ్రీ చింత పుల్లారెడ్డి ఎన్నికయారు.

శ్రీయుతులు ఎన్. సుబ్బారావు, ఎస్. పుల్లారెడ్డి, శ్రీమతి తుర్లపాటి మల్లికాంబ, ఎం. సూర్యనారాయణ, వై. అప్పలస్వామి, వి. మల్లికార్జునరెడ్డి, కె. జూలియాన్, బి. సకలారెడ్డి జి. రామిరెడ్డి, టి. నాగిరెడ్డి శ్రీమతి ఆళ్ళ వనజాక్షమ్మ సభ్యులుగా ఎన్నికయారు.

గత 15 సంవత్సరాలుగా కమ్యూనిస్టుల ప్రాబల్యంలో వున్న ఈ పంచాయితీ ఈ ఎన్నికలలో కాంగ్రెసు వశమైనది.

ఉప్పుమాగులూరు

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

చిలకలూరిపేట, జూన్ 11— ఒంగోలు జిల్లా, అద్దంకి తాలూకా ఉప్పుమాగులూరు పంచాయతీ సర్పంచిగా శ్రీ అయినాల నారాయణస్వామి ఒక్క ఓటు మెజారిటీతో ఎన్నికయ్యారు.

రాజోలు సమితి

రాజోలు, జూన్ 11— రాజోలు పంచాయతి సమితిలోని ఈ కింది పంచాయతీలకు దిగువ తెలిపిన వ్యక్తులు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు:

లక్కవరం—శ్రీ మంగిన వేణుగోపాలం (సమితి ప్రస్తుత అధ్యక్షులు). గుడిమూలం—శ్రీ రుద్రరాజు భీమరాజు (సమితి ప్రస్తుత ఉపాధ్యక్షులు). గుడిమెల్లంక — శ్రీ అల్లూరి వెంకటసూర్యనారాయణరాజు. పాలగుమ్మి—శ్రీఅప్పారి పైడిసెట్టి. తాటిపాక—శ్రీ చిక్కాల జానకిరామయ్య. పడిసెటిపల్లి — శ్రీ రుద్రరాజు పద్మరాజు. ఎల్లిపాలెం—శ్రీ వనమాలి స్వామి. మోరి— ముప్పర్తి వీరాస్వామి. శింకరగుంట— శ్రీ వోగరు సుబ్బారావు. మలికిపురం— శ్రీ ముదునూరి రామరాజు. విశ్వేశ్వరాయపురం— శ్రీ పిరి వీరాస్వామి. అప్పనిరామునిలంక—శ్రీరావూరి సూరన్న. (పై వారందరూ ఇంతకుముందు ఉన్న సర్పంచ్‌లు.)

శివకోడు—శ్రీ పినిసెట్టి వెంకటస్వామి. బి. సవరం— శ్రీ పేపేటి సూర్యనారాయణ. ఇరుసుమండ— శ్రీ వలవల తులసీరావు. సోంపల్లి —శ్రీ ఉండపల్లి సుబ్బారావు. పొదలాడ— శ్రీ గుబ్బల సత్యనారాయణమూర్తి. చింతలపల్లి— శ్రీ అల్లూరి రామకృష్ణరాజు. రామరాజులంక—శ్రీ బొరుసు వెంకటబ్రహ్మానందం. అంతర్వేదిపాలెం — శ్రీ అల్లూరి వెంకటపతిరాజు. గొంది — శ్రీ దంతులూరి జగన్నాథరాజు. మాట్రపు— శ్రీ కనుమూరి వెంకటకృష్ణరాజు. రామేశ్వరం— శ్రీ పిర్ల బాబూరావు. కత్తిమండ — శ్రీ అల్లూరి శ్రీరామనరసింహరాజు. కేశవదాసుపాలెం— శ్రీ ఎనుముల నరసింహారావు. చెనవరం—శ్రీ అల్లూరి రామకృష్ణంరాజు. ఉయ్యూరివారి మెరక—శ్రీ అల్లూరి తిరుపతిరాజు. కానూరి—శ్రీ పాముల ప్రకాశరావు. గూడపల్లి—శ్రీ కాపిసెట్టి వెంకటసత్యనారాయణమూర్తి. అంతర్వేది శ్రీ పిల్లా వెంకటరత్నం, ఎద్దవాలం—శ్రీ పెద్దిరెడ్డి లక్ష్మణరావు. గొల్లపాలెం —శ్రీమన్నే వెంకటరత్నం. బట్టేలంక—శ్రీ బోనం తాతయ్య ఉరఫ్ కనకయ్య. చింతలమోరి — శ్రీ కొమరగిరి శ్రీ రామారావు. తూర్పుపాలెం, శ్రీ అడబాల తులసీ రామదాసు. శృంగవరప్పాడు—శ్రీ రావి సత్యనారాయణమూర్తి.

రాజోలుకు శ్రీ నన్న నాగేశ్వరరావు సర్పంచ్‌గాను, శ్రీ పూనాటి హనుమంతరావు ఉప సర్పంచ్‌గాను ఏకగ్రీవంగా ఎన్నికయినారు.

అమ్మాన్‌లో అమెరికన్ దౌత్యోద్యోగి కాల్చివేత

యుద్ధ విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ గెరిల్లాలకు, జోర్డాన్ సేనలకు మధ్య పోరాటం

ఒక హోటల్‌లో 38 మంది విదేశీయుల నిర్బంధం

బీరూట్ జూన్ 11—

అమ్మాన్‌లో పాలస్తీనా గెరిల్లాలు అమెరికా దౌత్య కార్యాలయం సైనికోద్యోగి మేజర్ రాబర్టు పెర్రీ ఇంటిపై దాడి చేసి ఆయనను కాల్చివేసినట్టు అక్కడ నుంచి వచ్చిన యాత్రికులు తెలియజేశారు.

జోర్డాన్ ప్రభుత్వానికి, గెరిల్లాలకు మధ్య యుద్ధ విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ గత రాత్రి కొద్ది విరామం తర్వాత తిరిగి పోరాటం చెలరేగింది.

పాలస్తీనా గెరిల్లాలు నిన్న అమెరికా దౌత్య కార్యాలయోద్యోగి మేజర్ రాబర్టు పెర్రీ-ఇంటిపై దాడి చేసి, అతనిని కాల్చి వేసినట్లు అమ్మాన్ నుంచి బీరూట్ వచ్చిన యాత్రికులు నిన్న రాత్రి చెప్పారు.

అమెరికన్ దౌత్య కార్యాలయం వద్ద అమెరికన్ వర్తా వాడు ఈ సమాచారం అందజేసినట్లు ఆ యాత్రికులు వెల్లడించారు.

హోటల్‌లో 38మంది విదేశీయుల నిర్బంధం

అమ్మాన్‌లోని ఒక హోటల్‌లో అరబ్ గెరిల్లాలు నిన్న 38 మంది విదేశీయులను నిర్బంధించారు. గెరిల్లాలు ఆ హోటల్‌ను ఆక్రమించుకొని దాన్ని సైనిక శిబిరంగా మార్చారు.

పాలస్తీనా కాందిశీకుల శిబిరాలపై జోర్డాన్ సైనికులు కాల్పులు కొనసాగించినంతకాలం ఆ విదేశీయుల భద్రతకు తాము బాధ్యత వహించజాలమని పాలస్తీనా విమోచనకు ఏర్పడిన మార్క్సిస్టు పాపులర్ ఫ్రంట్ ప్రతినిధి ఒకరు చెప్పారు.

ఆ హోటల్ నుంచి తప్పించుకొని వచ్చిన ఇద్దరు అమెరికన్ విలేకరులు బీరూట్‌లో పత్రికల వారితో మాట్లాడుతూ తాము హోటల్ నుంచి ఎలాగో తప్పించుకొని వచ్చామని, అక్కడ వున్న మిగతా విదేశీయులు క్షేమంగా వున్నారని చెప్పారు.

అక్కడ నిర్బంధింపబడిన వారిలో 17 మంది అమెరికన్లు 18 మంది బ్రిటిష్ వారు, ముగ్గురు పశ్చిమ జర్మనీవారు.

అమ్మాన్‌లో తిరిగి పోరాటం

జోర్డాన్ సైన్యానికి అరబ్ గెరిల్లాలకు మధ్య యుద్ధ విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, కొద్ది విరామం తర్వాత తిరిగి పోరాటం ప్రారంభమైనట్లు ఆస్ట్రేలియా రేడియో నేటి ఉదయం పేర్కొన్నది.

ఇవాళ తెల్లవారు ఝామున జోర్డాన్ సైనికులు, అరబ్ గెరిల్లాలు అమ్మాన్ వీధులలో తిరిగి యుద్ధవిరమణ ఒప్పందం కుదిరినట్లు ప్రకటించారు.

అయితే ఆ ప్రకటన జరిగిన రెండు గంటలలోనే రాజధానిలో తిరిగి పెద్దఎత్తున పోరాటం చెలరేగినట్లు గెరిల్లా ప్రతినిధి చెప్పారు.

తమకు వెంటనే ఇరాక్, సిరియాలు సహాయం చేయాలని అల్‌ఫాత్ విజ్ఞప్తి చేసింది.

అరబ్ రాజ్యాలకు విజ్ఞప్తి

అమ్మాన్‌లో పోరాటం అంతమొందించడానికి అరబ్ రాజ్యాధినేతలు వెంటనే జోక్యం చేసుకోవాలని కయిరోలోని గెరిల్లా సంస్థల కేంద్ర సంఘం నిన్న విజ్ఞప్తి చేసింది.

అమెరికాపై గెరిల్లాల ఆరోపణ

జోర్డాన్ రాజు హుస్సేన్‌ను పదవినుంచి తొలగించి ఆయన సోదరుడు ప్రిన్స్ హసన్‌ను అధికారంలోకి తీసుకొనిరావడానికి అమెరికా కుట్ర జరుపుతున్నట్లు పాలస్తీనా గెరిల్లాల గ్రూప్‌లో పెద్దదైన అల్‌ఫాతా కమాండోలు ఆరోపించారు.

ఎన్నిక ముందు మంచినీటి కుళాయి

ఉప ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం పట్ల మేయర్ ఆక్షేపణ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 11—వచ్చే ఆదివారంనాడు పోలింగ్ జరగనుండగా హైదరాబాద్ నియోజకవర్గంలో మంచినీటి కుళాయికి రాత్రి ఉపముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేయడంలోని ఔచిత్యాన్ని హైదరాబాద్ మేయర్ శ్రీ ఎస్. లక్ష్మీనారాయణ నేడు ప్రశ్నించారు.

ఆయన నేడు చేసిన పత్రికా ప్రకటనలో, నగరం మొత్తంలో మూడు వందల మంచినీటి కుళాయిలను ప్రారంభించవలసివుందని గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వాన్ని కార్పొరేషన్ కోరుతున్న విషయాన్ని గుర్తు చేసి, కాని, ఇన్ని సంవత్సరాలు ప్రభుత్వం ఆ విషయంలో ఏ మాత్రం ఆసక్తి చూపించ దానికి ఎన్నడూ ప్రయత్నించలేదని ఆయన చెప్పారు. 210 మంచినీటి కుళాయిల నిర్మాణానికి కార్పొరేషన్ ఇటీవల తీర్మానించింది. అందుకు ప్రభుత్వం ఆమోదించిందని ఆ ప్రకటనలో శ్రీ లక్ష్మీనారాయణ తెలిపారు.

సంజీవరెడ్డి కాలనీలో [illegible] తొలగింపు

రహదారి నిర్మాణ శాఖ వర్గంలోని [illegible] రెడ్డి కాలనీలో ఇళ్ల జాబితా నుంచి [illegible] పేర్లు కొన్ని తొలగించడంపై తాను [illegible] జరుపుతున్నానని ముఖ్యమంత్రి పత్రికా విలేకరులకు చెప్పారు.

ఈ ఒక్క సంఘటనే తన దృష్టికి రావడం జరిగిందని ఆయన [illegible]రు.

త్రివేండ్రంలో రష్యా సాంస్కృతిక కేంద్రం భవనం

నిర్మాణానికి ఢిల్లీ అనుమతి

త్రివేండ్రం జూన్ 11—త్రివేండ్రంలో సోవియట్ సాంస్కృతిక కేంద్రం భవనం నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించారు. గత డిసెంబర్‌లో ఈ భవన నిర్మాణం నిలిచి పోయింది. అయితే కేంద్రప్రభుత్వం ఉభయ వాళ్ని పూర్తి చేయడానికి అనుమతించిన దృష్ట్యా నిర్మాణం పనిని తిరిగి ప్రారంభించారు.

ఈ భవనం నిర్మాణం పూర్తి అయిన తర్వాత కేంద్ర ప్రభుత్వం అనుమతిలేకుండా దీన్ని ఏ విధంగాను ఉపయోగించరాదన్న షరతు నిబంధనలకు అంగీకరించినదని, ఇందుకు సోవియట్ యూనియన్ దౌత్య కార్యాలయం అంగీకరించినదని తెలుస్తున్నది.

భవనం నిర్మిస్తుండగా కొంత భాగం కూలిపోవడంతో ఈ నిర్మాణం గత డిసెంబర్‌లో నిలిచిపోయింది.

అఖిల భారత చేనేత కార్మికుల సదస్సు

ఈ నెల 14 నుంచి నాగపూర్‌లో ప్రారంభం

నాగపూర్, జూన్ 11— అఖిల భారత చేనేత కార్మికుల సదస్సు ఈనెల 14 నుంచి ఇక్కడ మూడు రోజులపాటు జరుగుతుంది.

జాతీయ స్థాయిలో మొదటిసారిగా జరుగుతున్న ఈ సదస్సులో చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను చర్చిస్తుంది.

దాదాపు 150 మంది చేనేత కార్మిక సంస్థల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారని భావిస్తున్నారు.

నేపాల్ రాజు మహేంద్ర 50 వ జన్మదినోత్సవం సందర్భంగా జూన్ 11న నేపాల్ భారత-నేపాల్ మైత్రీ సంఘం సమావేశంలో ప్రత్యేక ప్రార్థనలు జరుపుతున్నట్లు న్యూఢిల్లీ వార్త.

ప్రభుత్వానికి ఆర్. ఎస్. ఎస్. ఇచ్చిన హామీ

ప్రజలకు స్పష్టంచేయాలని రిపబ్లికన్‌పార్టీ నాయకుని విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూన్ 10— రాజకీయాలలో గాని, దేశ ప్రయోజనాలకు విరుద్ధమైన ఇతర కార్యక్రమాలలో గాని పాల్గొనబోమని ఆర్. ఎస్. ఎస్. హామీ ఇచ్చినదీ, లేనిదీ ప్రభుత్వం స్పష్టంచేయాలని, భారత రిపబ్లికన్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ బి. డి. ఖోబ్రగడే నేడు కోరారు.

నేడు చేసిన పత్రికా ప్రకటనలో తమపై నిషేధం తొలగించినప్పుడు అటువంటి హామీ ఏదీ ఇవ్వలేదని ఆర్. ఎస్. ఎస్. నాయకుడు శ్రీ ఎం. ఎస్. గోల్వాల్కర్ ఇటీవల చేసిన ప్రకటనవల్ల ప్రజలలో కొన్ని అనుమానాలు, గందరగోళానికి దారితీసింది అని ఆయన తెలియజేశారు.

అందువల్ల, ఈ విషయంలో వాస్తవ పరిస్థితి ప్రజలకు తెలియజేయవలసిన అవసరం వుందని ఆయన అన్నారు.

మహారాష్ట్ర గోమంతక్ పార్టీలో సంక్షోభం

బొంబాయి, జూన్ 10— మహారాష్ట్ర గోమంతక్ పార్టీలో పెచ్చరిల్లుతున్న సంక్షోభం దృష్ట్యా ఆ పార్టీ అధ్యక్షులైన గోవా ముఖ్యమంత్రి శ్రీ దయానంద బండోద్కర్ నగరంలో తమ కార్యక్రమాలన్నిటిని రద్దుచేసుకొని నేటి మధ్యాహ్నం పనాజికి హుటాహుటిని తిరిగి వెళ్ళారు.

రేపు ఢిల్లీకి బయలుదేరి వెళ్ళనున్న శ్రీ బండోద్కర్ ఆ ప్రయాణాన్ని కూడా రద్దు చేసుకున్నారు.

ఎకరానికి 60 బస్తాల పంట

కరీంనగరం జిల్లా రైతు కృషి

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 11— కరీంనగరం జిల్లా హుజూరాబాద్‌లో అభ్యుదయ రైతు గల శ్రీ ఎ. బచ్చిరామిరెడ్డి ఎకరానికి 60 బస్తాల పంట పండించారు.

1969 తొలి పంటకాలంలో "జయ" రకం వంగడాలతో రెండు ఎకరాల ప్లాటులో సేద్యం ప్రారంభించారు.

ఫలసాయంపట్ల ఎకరానికి 1454 రూపాయల ఆదాయం లభించింది. అయితే నాలుగున్నర నెలలపాటు చేసిన సేద్యానికి అయిన ఖర్చు 646 రూపాయలే.

ఒంగోలు వద్ద ఆహారధాన్యాల పట్టివేత

హైదరాబాద్, జూన్ 11— తమిళనాడుకు అక్రమంగా రవాణా జరుగుతున్నదన్న అనుమానించబడిన అయిదు బస్తాల ఆహారధాన్యాలను సోమవారంనాడు గుంటూరు జిల్లాలో విజిలెన్స్ సెల్ స్వాధీనం చేసుకొని వేలం వేసింది.

ఈ వాగన్లను ఒంగోలువద్ద అటకాయించినట్లు విజిలెన్స్ సెల్ సూపరింటెండెంట్ శ్రీ గురునాథరావు చెప్పారు.

విధాయక్ దళ్‌కు శ్రీ తివారీ నాయకత్వం

బీహార్ ఎస్. ఎస్. పి. లెజిస్లేచర్‌పార్టీ ఆమోదం : కొందరి విముఖత

పాట్నా, జూన్ 10—

కొత్తగా ఏర్పాటు చేయ సంకల్పించిన సంయుక్త విధాయక్ దళ్‌కు నాయకత్వం వహించడానికి లెజిస్లేచర్ పార్టీ నాయకుడు శ్రీ రామానంద తివారీకి బీహార్ సంయుక్త సోషలిస్టు పార్టీ నేడు అనుమతించింది.

నాయకత్వం విషయంలో ఇంతవరకు వివాదం వుంది.

పార్టీ సోనేపూర్ తీర్మానం దృష్ట్యా లెక్క సంఘటనకు ఎస్. ఎస్. పి. నాయకుడు శ్రీ తివారీ నాయకత్వం వహిస్తారని లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో ఆమోదించిన తీర్మానంలో తెలియజేశారు.

ప్రస్తుత అసెంబ్లీ సమావేశం సందర్భంలోనే డూగా ప్రసాద్ రాయ్ ప్రభుత్వాన్ని కూలద్రోయాలని కూడా పార్టీ నిర్ణయించింది. ఈ సందర్భంగా ఇతర ప్రతిపక్షాలతో సంప్రతించి అవసరమైన చర్యలు తీసుకోవడానికి శ్రీ తివారీకి అధికారం ఇస్తూ కూడా తీర్మానించారు.

శ్రీ తివారీ నాయకత్వానికి వ్యతిరేకత

ప్రతిపక్ష ఐక్యసంఘటనకు శ్రీ తివారీ నాయకత్వం వహించడం తమకు సమ్మతం కాదని, చీఫ్‌విప్ శ్రీ తులసీసింగ్, శ్రీ భోలాప్రసాద్ సింగ్ నాయకత్వాన రాష్ట్ర ఎస్.ఎస్.పి. లెజిస్లేచర్ పార్టీలోని ఒకవర్గం తమ వ్యతిరేకతను తెలియజేసింది.

ఆ ఇద్దరు నాయకులు పత్రికా విలేకరులతో మాట్లాడుతూ, కొత్తగా ఏర్పాటు చేయ తలపెట్టిన ఐక్యసంఘటనకు హరిజన్ గాని, ఆదివాసీకాని, వెనుకబడిన తరగతికి చెందిన వ్యక్తికాని నాయకత్వం వహించకపోతే, ప్రస్తుత అధికార కాంగ్రెస్ నాయకత్వాన వున్న ప్రభుత్వాన్ని కూలద్రోయడం జరగదని చెప్పారు.

ఐక్యసంఘటన నాయకుడుగా శ్రీ తివారీ ఎన్నికను ఆమోదిస్తూ అంతకుముందు పార్టీ లెజిస్లేచర్ పార్టీ మెజారిటీ తీర్మానం ఆమోదించిన తరువాత ఈ ప్రకటన చేశారు. శ్రీ తివారీ నాయకత్వాన్ని ఆమోదిస్తూ తీర్మానాన్ని ప్రతిపాదించగానే శ్రీ తివారీని వ్యతిరేకించే సభ్యులలో ఎక్కువ మంది పార్టీ సమావేశం నుంచి వెళ్ళిపోయారు.

నాయకత్వం విషయంలో సమావేశంలో ఒక నిర్ణయం జరగలేదని ఆ ఇద్దరు నాయకులు తెలియజేశారు.

కాలనిర్ణయంతో కూడిన కనీస కార్యక్రమం ముందు నిర్ణయించాలని పార్టీ తీర్మానించిందని, దాని తరువాతనే ఐక్యసంఘటన ఏర్పాటు చేయాలని, నాయకత్వం విషయం చివరకు నిర్ణయించాలని వారు తెలియజేశారు.

ముస్లింలీగ్ బ్యాంకి నిధుల బంద్

పాక్ ప్రభుత్వం చర్య

న్యూఢిల్లీ, జూన్ 10— దేశంలోని వివిధ బ్యాంకులలో నిల్వవున్న ముస్లింలీగ్ నిధులను బంద్ చేస్తూ పాకిస్తాన్ ప్రభుత్వం నేడు ఉత్తరువు జారీచేసింది.

వారి లెక్కల విషయంలో దర్యాప్తు పూర్తి అయ్యేవరకు ముస్లింలీగ్ నిధులలో డిపాజిటు చేయడంకాని, ఉపసంహరించడం కాని చేయకూడదని ఆ ఉత్తరువులో వున్నట్టు పాకిస్తాన్ రేడియో ప్రసారం చేసింది.

కుమారమంగళం వ్యాఖ్యానాలు

శ్రీ గురుపాదస్వామి విమర్శ

బెంగుళూరు, జూన్ 10— ఈ నెల ఎనిమిదవ తేదీన భారత మాజీ సర్వసేనాపతి కుమారమంగళం వ్యక్తం చేసిన అభిప్రాయాలు చాలా ప్రమాదకరమైనవి. గర్హనీయమైనవని రాజ్యసభలో ప్రతిపక్ష కాంగ్రెసు ఉపనాయకుడు శ్రీ గురుపాదస్వామి నిన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రీ గురుపాదస్వామి ఇలా పేర్కొన్నారు:

"ప్రపంచ చరిత్రలో చెప్పుకొనదగిన వారెవరూ స్వయంగా మిలిటరీ నియంతృత్వం కావాలని కోరుకొనలేదు. మిలిటరీ పరిపాలన స్వాతంత్ర్యానికి ప్రత్యామ్నాయం కాదు. మాజీ సర్వసైన్యాధిపతి అటువంటి ప్రసంగాలు చేయడం దేశ ప్రజలకు, ప్రజాస్వామ్యానికి అవమానం.

"అటువంటి అభిప్రాయాలను వ్యక్తం చేయవలదని కుమార మంగళంను హోం మంత్రి ఆదేశించాలని, లేదా తీవ్ర పరిణామాలు ఎదుర్కొనవలసి వస్తుందని కూడా చెప్పవలసిందని కోరుతున్నాను."

"శాస్త్రి" టాంకర్

యుగోస్లావియా షిప్‌యార్డుచే భారత నౌకాసంస్థకు అందజేత

స్ప్లిట్ (యుగోస్లావియా) జూన్ 10— ఇక్కడి నౌకా నిర్మాణ కేంద్రం, డీజల్ ఇంజన్ ఫ్యాక్టరీ "శాస్త్రి" అనే పేరుగల 88 వేల డెడ్‌వెయిట్ టన్నుల బరువుగల కొత్త టాంకర్‌ను భారత షిప్పింగ్ కార్పొరేషన్‌కు అందజేసింది.

నిన్న అందజేసిన ఈ టాంకర్, భారతీయ సంస్థకోసం "స్ప్లిట్ షిప్ యార్డ్" తయారుచేసిన వాటిలో రెండవది.

ఈ టాంకర్ నిర్మాణానికి దాదాపు 15 నెలలు పట్టింది.

రు. 34 వేల దొంగ ఆహారధాన్యాల పట్టివేత

హైదరాబాద్, జూన్ 10— గుంటూరు జిల్లాలో గత సోమవారంనాడు రెండు వ్యాగన్ల లోడ్‌గల 526 బస్తాల ఆహారధాన్యాలను ప్రభుత్వం స్వాధీనంచేసుకొన్నది. ఈ ఆహారధాన్యాల విలువ 34 వేల రూపాయలు.

నిఘా విభాగం పోలీసు సూపరింటెండెంట్ శ్రీ జి. గురునాథరావు నేడిక్కడ మాట్లాడుతూ తమిళనాడుకు దొంగతనంగా రవాణా అవుతున్న ఈ రెండు వ్యాగన్ల ఆహారధాన్యాలను ఒంగోలు వద్ద పట్టుకొన్నట్లు తెలిపారు.

ఏలూరు కేంద్రంలో 1965 ఆంధ్రప్రదేశ్ కిరోసిన్ (లైసెన్స్), పంపిణీ ఉత్తర్వును ఉల్లంఘించినందుకు గుంటూరు జిల్లాలో 44 పంపుల కిరోసిన్‌ను స్వాధీనం చేసుకొన్నారు. ఏర్పాటులో ఇద్దరు వ్యక్తుల దాడుల నుంచి ఈ కిరోసిన్‌ను నిఘా విభాగం స్వాధీనంచేసుకొనడం జరిగింది.

కొచ్చిన్ రేవు కార్మికుల సమ్మె

నిరవధికంగా కొనసాగింపుకు నిర్ణయం

కొచ్చిన్, జూన్ 10— కొచ్చిన్ రేవు కార్మికులు సుమారు 12 వందల మంది గత 15 రోజులుగా చేస్తున్న సమ్మె పరిష్కారానికి చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి. సమ్మెను నిరవధికంగా కొనసాగించడానికి మూడు కార్మిక సంఘాలు నిర్ణయించాయి.

కొచ్చిన్ థామస్‌తో ఓడరేవు యూనియన్ సంయుక్త కార్యదర్శి శ్రీ కె. ఎం. ఇబ్రహీం నేడిక్కడ పత్రికా విలేకరులకు ఈ విషయం తెలియజేశారు.

హైదరాబాద్‌లో ఐదుగురు ప్రజా సమితి కార్యకర్తల అరెస్టు

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 10— తెలంగాణా ప్రజాసమితికి చెందిన కార్యకర్తలుగా చెప్పబడుతున్న శ్రీ రాజారామ్ పరాయుడు, మరి నలుగురిని నిన్న పోలీసులు అరెస్టు చేసినట్లు ఇక్కడి ప్రజాసమితి తెలియజేసింది. వీరంతా చారికమాన్‌కు చెందినవారట.

[illegible] ఉపఎన్నికలో తెలంగాణా ప్రజాసమితికి చెందిన అభ్యర్థి శ్రీ నాగం కృష్ణారావు గెలుపుకు విద్యార్థులంతా సమిష్టిగా కృషి సల్పవలసిందిగా తెలంగాణా విద్యార్థుల కేంద్ర కార్యాచరణ సంఘం నిన్నటి సమావేశంలో విజ్ఞప్తి చేసింది.

శ్రీ టి. వెంకటరెడ్డి ఏర్పాటుచేసిన ఈ సమావేశంలో విద్యార్థి నాయకుడు శ్రీ మల్లికార్జున్‌ను బలవంతంగా పట్టడిలో వుంచడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

డాక్టర్ చెన్నారెడ్డి విజ్ఞప్తి

ఉప ఎన్నికలో శ్రీ నాగం కృష్ణారావు అధిక సంఖ్యాక ఓట్లతో గెలుపు సాధించడానికి ఓటర్లు హెచ్చు సంఖ్యలో పోలింగులో పాల్గొనాలని ప్రజాసమితి అధ్యక్షుడు డాక్టర్ ఎం. చెన్నారెడ్డి విజ్ఞప్తి చేశారు.

ప్రకాశనగర్ మైదానంలో ఏర్పాటైన బహిరంగ సభలో డాక్టర్ చెన్నారెడ్డి ప్రసంగించారు.

బీహార్ అసెంబ్లీలో దినపత్రికల చించివేత

పాట్నా జూన్ 10— నేడు బీహార్ శాసనసభ సమావేశం ముగిసే సమయంలో దాదాపు 12 మంది ఎస్. ఎస్. పి. సభ్యులు ఒక్కసారిగా లేచి నిలబడి హిందీ, ఇంగ్లీషులలో ప్రచురితమయ్యే రెండు పాట్నా దినపత్రికలను చించివేశారు.

ఈ వార్తా పత్రికలు తమ పార్టీ గురించి అసత్యమైన, నిరాధారమైన వార్తలను ప్రచురించినట్లు వారు ఆరోపించారు.

ఎస్.ఎస్.పి. సభ్యులు చేసిన మరి కొన్ని వ్యాఖ్యలను సభాధ్యక్ష స్థానంలో వున్న శ్రీ జహూర్ అహ్మద్ ఖండించారు.

రెవిన్యూ మంత్రి శ్రీ చంద్రశేఖర్ సింగ్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తుతూ, సభ్యులు చెయిర్మన్ అనుమతి లేకుండా వ్యవహరిస్తున్నారని, అందుచేత వారిపై చర్య గైకొనాలని పేర్కొన్నారు.

జీవితభీమాసంస్థ పునర్వ్యవస్థీకరణ

ఎల్. ఐ. సిని అయిదు శాఖలుగా విడగొట్టాలని చైర్మన్ శ్రీ పాయ్ సూచన

న్యూఢిల్లీ, జూన్ 10— జీవితబీమా కార్పొరేషనును అయిదు కార్పొరేషన్‌లకింద విడగొట్టాలని కార్పొరేషన్ అధ్యక్షుడు శ్రీ టి. ఎ. పాయ్ నేడు అభిప్రాయం వెలిబుచ్చారు.

ప్రస్తుతం ఒకే సంస్థగా వున్న ఎల్. ఐ. సి. ని విభజించరాదని కేంద్రప్రభుత్వం చేసిన నిర్ణయంపై శ్రీ పాయ్ వ్యాఖ్యానిస్తూ, దేశ ప్రయోజనాల దృష్ట్యా, పాలసీహోల్డర్ల ప్రయోజనాల దృష్ట్యాను కార్పొరేషను విడగొట్టి, అయిదు కార్పొరేషన్‌లుగా చేయడం అవసరమని అన్నారు.

దేశంలో నేటికి 30 జిల్లాలకు ఎల్.ఐ.సి. బ్రాంచీలు లేవని, దేశంలో ప్రతి కుటుంబానికి భీమా సౌకర్యం కల్పించలేకపోతే సంస్థ తన విధి నిర్వహణలో విఫలమైనట్లేనని ఆయన అన్నారు.

మరింత సమర్థవంతంగా సంస్థ పని చేయాలంటే ఎల్.ఐ.సి.ని అయిదు లేదా అంతకన్నా ఎక్కువ స్వతంత్ర ప్రతిపత్తిగల శాఖలుగా విడగొట్టాలని ప్రభుత్వరంగంలోని వ్యవహారాలు పరిశీలించే పార్లమెంటరీ కమిటీ సూచించి వున్నదని కూడా శ్రీ పాయ్ చెప్పారు.

ప్రస్తుతం ప్రతిపక్ష కాంగ్రెస్‌నాయకుడుగా వున్న శ్రీ మొరార్జీదేశాయ్ కూడా లోగడ ఆర్థిక మంత్రిగా వున్నప్పుడు ఈ అభిప్రాయాన్ని కలిగివున్నట్లు శ్రీ పాయ్ చెప్పారు.

అయితే, పరిపాలనా సంస్కరణల కమిషన్, మొరార్జీ కమిటీలు మాత్రం కార్పొరేషన్ పునర్వ్యవస్థీకరణను వ్యతిరేకించినట్లు ఆయన తెలిపారు.

జీవితభీమా సంస్థ ఉద్యోగులచే కొత్త తరహా ప్రదర్శనలు

హైదరాబాద్‌లో

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 10— జీవితభీమా సంస్థ ఉద్యోగులు తమ కోర్కెల సాధనకు జరుపుతున్న ఆందోళనలో కొత్త పద్ధతి నవలంబించారు.

వారు తమ ఆఫీసులో ప్రతిరోజు, [illegible] నడుస్తూ నినాదాలుచేశారు.

పాలకవర్గం "కార్మిక వ్యతిరేక" విధానాన్ని ఖండిస్తూ నేటి మధ్యాహ్నం పని వేళల్లో [illegible] చెందిన దాదాపు [illegible] మంది ఉద్యోగులు ప్రదర్శనలు చేశారు.

కాంగ్రెస్ ఎన్నికల చిహ్నం వివాదం

'ప్రధాని ప్రభృతులను సాక్షులుగా పిలవాలి'

చీఫ్ ఎలెక్షన్ కమిషనర్‌కు ప్రతిపక్షం కాంగ్రెస్ న్యాయవాది పిటిషన్

న్యూఢిల్లీ, జూన్ 11—

కాంగ్రెస్ ఎన్నికల చిహ్నం కేసు సందర్భంగా ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరా గాంధీని, కొత్త కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ జగజీవన్‌రామ్‌ను సాక్షులుగా రప్పించాలని ప్రతిపక్షం కాంగ్రెస్ తరఫున వాదిస్తున్న న్యాయవాది శ్రీ కె. సి. శర్మ నేడు ఎలెక్షన్ కమిషన్‌ను కోరారు.

చీఫ్ ఎలెక్షన్ కమిషనర్ శ్రీ సేన్‌వర్మ ముందు దాఖలు చేసిన పిటీషను అనుబంధంగా న్యాయవాది శ్రీ శర్మ విజ్ఞప్తి చేశారు.

మరొక ఆరుగురిని కూడా సాక్షులుగా పిలవాలని ఆయన కోరారు.

వారు: శ్రీయుతులు ఫక్రుద్దీన్ అలీ అహ్మద్, సుబ్రహ్మణ్యం, ఉమాశంకర్ దీక్షిత్, ఎల్. ఎ. స్వామినాథన్, పి. [illegible] రెడ్డి, కె. వెంకటరత్నం.

కుమారి అజిత నిరవధిక నిరశనదీక్ష కొనసాగింపు

కేరళ నక్సలైట్ నాయకురాలు

కోజికోడ్, జూన్ 11— జూన్ 1వ తేదీ నుంచి నిరవధిక నిరశనదీక్ష కొనసాగిస్తున్న నక్సలైట్ కుమారి అజిత నేడు బలహీనంగా వున్నట్లు తెలుస్తున్నది.

పగటి వేళలో తనను లోపటి మాళిగ జైలులో ఉంచాలని కుమారి అజిత చేసిన విజ్ఞప్తిని అధికారులు తిరస్కరించడంతో ఆమె నిరశనదీక్ష ప్రారంభించారు.

ఆమెకు సానుభూతిగా ఆమె తండ్రి కున్నిక్కల్ నారాయణన్ కూడా నిరవధిక నిరశనదీక్ష కొనసాగిస్తున్నారు.

తెలిచేరిలోని పుల్‌పల్లి పోలీస్ స్టేషన్‌పై క్రితంసారి దాడి చేసిన కేసులో తండ్రి, కుమార్తె ఇద్దరూ వున్నారు.

శ్రీ డి. సంజీవయ్య ఢిల్లీ పునరాగమనం

న్యూఢిల్లీ జూన్ 11 — జెనీవాలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సదస్సుకు హాజరైన 13 మంది సభ్యుల భారత ప్రతినిధి వర్గానికి నాయకత్వం వహించిన కార్మిక మంత్రి శ్రీ డి. సంజీవయ్య నేడిక్కడకు తిరిగి వచ్చారు.

పత్రికల స్వేచ్ఛకు రాష్ట్రప్రభుత్వాల ఆటంకం

ప్రధానికి శ్రీ బిజోరీదాస్ విజ్ఞప్తి

కటక్, జూన్ 11— పత్రికల స్వేచ్ఛను దిన వ్యవహారాలలో రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొంటున్నందువల్ల పి.ఎస్.పి. సంయుక్త కార్యదర్శి ఆందోళనను తెలియజేస్తూ ప్రధాని ఇందిరకు ఒక లేఖ వ్రాశారు.

ఇటువంటి ధోరణులను నిరోధించడానికి చర్యలు గైకొనవలసిందని కూడా ఆయన కోరారు.

చెకొస్లొవేకియా వరదలలో 34 మంది దుర్మరణం

న్యూఢిల్లీ జూన్ 10— చెకొస్లొవేకియా వరదలలో 34 మంది [illegible] కొట్టుకుపోయినట్లు నేడు బి. బి. సి. రేడియో ప్రకటించింది.

"రెండు ఏ. ఐ. సి. సి. లకు కాంగ్రెస్ నియమావళిలో అవకాశం లేదు:"

— శ్రీ బిజూ పట్నాయక్ ప్రకటన

కటక్ జూన్ 10—

పార్టీ నియమావళి ప్రకారం వివిధ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలు ఎ. ఐ. సి. సి. ని ఏర్పాటుచేయడానికి వీలులేదని, ప్రస్తుతం ఉన్నవి రెండు గ్రూపులేగాని, రెండు ఎ. ఐ. సి. సి. లు కావని, నియమావళిలో రెండు ఎ. ఐ. సి. సి. లకు స్థానంలేదని, ఒరిస్సా మాజీ ముఖ్యమంత్రి శ్రీ బిజుపట్నాయక్ అన్నారు.

నేడిక్కడ విడుదలచేసిన ఒక ప్రకటనలో కాంగ్రెసులోని రెండు గ్రూపులతో సంబంధాలు తెంచుకున్న తమ ఇండిపెండెంట్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పేరు, జెండా చిహ్నం ఉపయోగించుకోడానికి న్యాయబద్ధంగా హక్కు వున్నదని చెప్పినట్టు ఒక వార్తాసంస్థ తప్పుగా చిత్రించిందని ఆయన తెలియజేశారు.

పార్టీ నియమావళి ప్రకారం ఏర్పడిన ఎ. ఐ. సి. సి. మాత్రమే పి. సి. సి.లపై అధికారం కలిగివుంటుందని ఆయన తెలియజేశారు.

బ్రిటన్‌లో పత్రికల ప్రచురణకు ఆటంకం

ముద్రాపకుల, ప్రచురణకర్తల వివాదం ఫలితం

లండన్, జూన్ 10— ముద్రాపకులకు, ప్రచురణకర్తలకు మధ్య వివాదం ఫలితంగా బ్రిటన్‌లో జనరల్ ఎన్నికల ప్రచారం ఉధృతంగా జరుగుతున్న ఈ తరుణంలో వార్తాపత్రికల ప్రచురణ నిలిచిపోయే ప్రమాదం కనబడుతున్నది.

లండన్‌లోని ప్రధాన ప్రచురణ సంస్థలలో ముఖ్యమైన ఉద్యోగుల సమ్మె నేడు ప్రారంభం కానున్నది.

సమ్మె సంకల్పాన్ని తాత్కాలికంగా విరమించుకోవలసిందిగా ప్రధాని హెరాల్డ్ విల్సన్, ప్రతిపక్ష నాయకుడు ఎడ్వర్డ్ హీత్ చేసిన విజ్ఞప్తులు ఫలించలేదు.

టెక్టయిట్ శిలలు చంద్రమండలం నుంచి భూమిపై పడినవా?

వాషింగ్టన్, జూన్ 10— భూమి మీద ప్రధానంగా నాలుగుచోట్ల దొరికే వింతైన నలుపు ఆకుపచ్చ రంగు రాళ్ళు టెకటయిట్స్ చంద్రమండలంలో పుట్టి వుండవచ్చునని అపోలో-12 యాత్రికులు తెచ్చిన చంద్రశిలల వలన తెలుస్తున్నదని రోదసీ పరిశోధనా సంస్థ అధికారి డాక్టర్ జాన్ ఎ. ఒకీఫ్ చెప్పారు.

నిమ్మకాయ పరిమాణంలో వున్న చంద్ర శిలలో దొరికిన గ్లాస్ బహుశా టెకటయిట్ గ్లాస్ అయివుండవచ్చునని ఆయన అన్నారు.

టెక్టయిట్స్ పుట్టుకను గురించి జరుగుతున్న సిద్ధాంతాలకు చంద్రశిల నిర్మాణ విశేషాలవల్ల తగిన సమాధానం లభిస్తే, టెక్టయిట్స్ చంద్రుని నుంచి వచ్చినవేనన్న అంశం కాదనడానికి కారణం కనిపించదు అని ఆయన అన్నారు.

నలుపు, ఆకుపచ్చ రంగులలో వుండే టెక్టయిట్స్ బోహీమియా, మొరావియాలలోను, చెకొస్లొవాకియా తూర్పు సింధు ప్రాంతం, ఆస్ట్రేలియాలలో కొన్ని భాగాలలోను దొరుకుతున్నాయి.

అపోలో-12 యాత్రికులు తెచ్చిన చంద్రశిలలో టెకటయిట్, పొటాషియం, గ్రైనైట్ రసాయనిక మిశ్రమాలు వున్నాయని ఆయన అన్నారు.

టెక్టయిట్స్ భూమికి సంబంధించిన రాళ్ళనని లోగడ వున్న సిద్ధాంతం ఈ వాదనవల్ల తారుమారవుతుంది.

ఆరుగురు పాక్ శరణార్థుల అరెస్టు

అక్రమంగా ప్రేలుడు సామగ్రి తయారీ ఆరోపణపై

రాయపూర్, జూన్ 11 — 1964లో తూర్పు పాకిస్తాన్ నుంచి వచ్చి శిబిరానికి వచ్చిన ఆరుగురు శరణార్థులను అక్రమంగా ప్రేలుడు సామగ్రిని తయారుచేస్తున్నారనే ఆరోపణపై పోలీసులు నేడు అరెస్టు చేశారు.

రెండు నాటు పిస్తోళ్లను, కొన్ని ప్రేలుడు పదార్థాలను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు.

నక్సలైట్ ప్రేయసీ ప్రియుల వియోగబాధ

పోలీసులకు ఫేలర్, అమలేందుల విజ్ఞప్తి

ధాయిబాసా, జూన్ 10— ఇటీవల జాదుగోడా అడవిలో అరెస్టుచేసిన బ్రిటిష్ మహిళ కాథరిన్ ఫేలర్, ఆమె ప్రియుడు అమలేందు ఘోష్‌సేన్‌లు, తాము వియోగబాధ భరించలేమని పోలీసులకు చెప్పారు.

ఇటీవలే వారిని వేర్వేరు బస్సులలో హజారీబాగ్ జైలుకు కొనిపోయారు. తమను ఒకే బస్సులో వుంచవలసిందిగా వారు పోలీసు కానిస్టేబుళ్లను కోరారు.

వారి అభ్యర్థనను పోలీసులు వెంటనే అంగీకరించారు.

అర్ధరాత్రి అడవిలో మిస్ ఫేలర్‌ను అరెస్టు చేసిన పోలీసు ఉద్యోగి యు. ఎన్. ఐ. విలేకరితో మాట్లాడుతూ ఆమె ఒక చెట్టుకింద ఒంటరిగా కనిపించిందని తెలిపారు.

ఆమెను అరెస్టు చేస్తున్నట్లు తెలుపగా ఆమె వేసిన మొదటి ప్రశ్న "అమలేందు ఎక్కడ వున్నాడని?"

జర్మనీలోని ఒక సినిమా థియేటర్‌లో అతని ప్రక్కగా కూర్చున్నప్పుడు తమ తొలి సమావేశం జరిగిందని ఆమె పోలీసులకు చెప్పింది.

కుటుంబ కేంద్రాల నక్సలైట్ల దా[illegible]

పశ్చిమబెంగాల్‌లో

కలకత్తా, జూన్ 10— మిడ్నపూర్‌లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ కుటుంబ నియంత్రణ కేంద్రంపై నక్సలైట్ల గుంపు నిన్న దాడిచేసి, సామాన్లు ధ్వంసంచేసి, ముఖ్యమైన పత్రాలను దగ్ధంచేసినట్లు, నేడిక్కడ పోలీసు కేంద్ర కార్యాలయానికి అందిన సమాచారాన్ని బట్టి తెలుస్తున్నది.

జల్పాయిగురి పట్టణంలోని కుటుంబ నియంత్రణ కేంద్రంపై కూడా వారు నిన్న దాడిచేసి, అధికారపత్రాలను ధ్వంసంచేసినట్లు తెలుస్తున్నది.

24 పరగణాల జిల్లాలో ఏడుగురు నక్సలైట్ల అరెస్టు

24 పరగణాల జిల్లాలోని సోనార్పూర్ ప్రాంతంలో పోలీసులు నేటి తెల్లవారు ఝామున జరిపిన దాడిలో ఏడుగురు నక్సలైట్లను అరెస్టుచేశారు.

మూర్షిదాబాద్ జిల్లాలో జంగిపూర్ కాలేజి హాస్టల్ భవనంపై నక్సలైట్ల గుంపు గత సోమవారంనాడు ఎర్రజెండా ఎగురవేసినట్లు, అదేరోజున కళాశాల విద్యార్థులు ఆ జెండాను తొలగించినట్లు ఇక్కడకు ఆలస్యంగా అందిన సమాచారాన్నిబట్టి తెలుస్తున్నది.

జూన్ రెండవ తేదీన జరిగిన కోటిప్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (స్పెషల్ బ్రాంచి) హత్య సందర్భంగా డమ్‌డమ్ ప్రాంతంలో నేడు పోలీసులు నక్సలైట్ యువకుని అరెస్టు చేశారు.

ఈ సందర్భంగా ఇంతవరకు మొత్తం ఆరుగురు నక్సలైట్లను అరెస్టుచేశారు.

ఇద్దరు చైనీయుల అరెస్టు

తూర్పు పాకిస్తాన్ నుంచి 24 పరగణాల జిల్లాలోని హస్నాబాద్‌వద్ద నిన్న మధ్యాహ్నం భారత భూభాగంలోకి చొరబడిన ఇద్దరు చైనీయులను, ఇద్దరు పాకిస్తానీ ముస్లింలను అరెస్టుచేసినట్టు పశ్చిమబెంగాల్ హోం శాఖ ప్రతినిధి ఒకరు నేడిక్కడ చెప్పారు.

పరిశీలన పత్రాలు లేకుండా భారత భూభాగంలోకి వచ్చినందుకు, విదేశీయుల నిబంధనల చట్టం క్రింద వారిపై చర్య తీసుకోవడం ప్రారంభమైనదని ఆ ప్రతినిధి చెప్పారు.

అయితే, వారి వివరాలు తెలియలేదని ఆ ప్రతినిధి చెప్పారు.

10 మంది గిరిజన నక్సలైట్ల అరెస్టు

హైదరాబాద్ జూన్ 10— శ్రీకాకుళం జిల్లా పార్వతీపురం డివిజన్‌లోని [illegible] ఏజన్సీ ప్రాంతంలో జూన్ ఎనిమిదవ తేదీన జరిపిన దాడి సందర్భంలో 10 మంది గిరిజన నక్సలైట్లను అరెస్టు చేసినట్లు ఇక్కడి పోలీసు కేంద్ర కార్యాలయానికి అందిన సమాచారాన్నిబట్టి తెలుస్తున్నది. వారినుండి [illegible] కూడా స్వాధీనం చేసుకున్నారు.

వి. ఎస్. ఆర్. కళాశాల

తెనాలి

కళాశాల పునఃప్రారంభం 22-6-70

ఆర్ట్సు, కామర్సు మరియు సైన్సులలో అన్ని కాంబినేషన్లతో డిగ్రీ మరియు ఇంటర్మీడియెట్ కోర్సులకు కళాశాలలో బోధించబడును. ప్రవేశమునకు నిర్ణీత ఫారములో వున్న దరఖాస్తు ఫారములు, ప్రాస్పెక్టసు కొరకు రు. 2/- లు చెల్లించి పొందవచ్చును. బయట ప్రదేశములవారు మనీ ఆర్డరు ద్వారా రు. 2-50 లు చెల్లించి పొందవచ్చును.

—ప్రిన్సిపాల్.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్

నోటిఫికేషన్

ఆర్కిటెక్చర్‌లో సప్లిమెంటరీ డిప్లొమా మరియు సర్టిఫికేట్ పరీక్ష 22-6-1970 సోమవారం ఉదయం గం. 9-30 ల నుండి సెక్రటరీ, స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్ వారిచే జరుపబడును. పై పరీక్షకు హాజరుకాగోరే అభ్యర్థులు పరీక్షలలో ప్రవేశమునకు గాను నిర్ణీత ఫారముపై ప్రిన్సిపాల్, గవర్నమెంటు కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్సు అండ్ ఆర్కిటెక్చర్, హైదరాబాద్ వారికి 1-6-1970 తేదీనాటికి, ఫీజుల కలాసులతో సహా దరఖాస్తు చేయాలి. విజ్ఞప్తి దరఖాస్తు ఫారము ప్రిన్సిపాల్, గవర్నమెంటు కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్సు అండ్ ఆర్కిటెక్చర్, హైదరాబాద్‌వారి నుండి పొందవచ్చును. వివరములుగల పరీక్ష టైంటేబిలు పై పేర్కొన్న కాలేజీ నోటీసు బోర్డుపై చూడవచ్చును.

(సం) సి. కామేశ్వరరావు,
ఫర్ సెక్రటరీ.
స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్, ఆం. ప్ర. హైదరాబాద్.

శ్రీ తిరుపతి దేవస్థానములు : తిరుపతి

శ్రీ వేంకటేశ్వర శిల్ప శిక్షణా కేంద్రము

తిరుపతి

1970-71 సంవత్సరమునకు శ్రీ వేంకటేశ్వర శిల్ప శిక్షణా కేంద్రము, 1-7-1970 తేదీన తిరిగి ప్రారంభింపబడును.

శ్రీ వేంకటేశ్వర శిల్ప శిక్షణా కేంద్రము, తిరుపతిలో 4 సంవత్సరముల ట్రెయినింగ్ కోర్సులో ప్రవేశమునకు 30-6-1970 తేదీలోగా లేదా అంతకు దరఖాస్తులు కోరబడుచున్నవి. తగిన పోస్టేజి స్టాంపులు అంటించి స్వంత చిరునామా వ్రాసిన కవరు అభ్యర్థనతోపాటు పంపి సూపరింటెండెంట్, శ్రీ వేంకటేశ్వర శిల్ప శిక్షణా కేంద్రము, తిరుపతి వారి నుండి దరఖాస్తు ఫారములు మరియు ప్రాస్పెక్టసు, పొందవచ్చును.

కోర్సు కాల పరిమితి 4 సంవత్సరములు. బోధన (1) తెలుగు (2) తమిళం రెండు భాషలలో జరుగును. అభ్యర్థులకు మొదటి సంవత్సరము, నెలకు రు. 40/- స్టైపెండ్ యివ్వబడును. ఆ తరువాతి సంవత్సరమునకు రు. 5/- లు ఇంక్రిమెంటు యివ్వబడును. ఉచిత వసతి సౌకర్యములు కూడా లభింపచేయబడు.

అర్హతలు మరియు వయస్సు: అభ్యర్థులు తెలుగు (లేదా) తమిళంలో 40% తక్కువ కాని మార్కులతో కనీసము IV ఫారము వాసై యుండాలి. మరియు స్వంతంగా వ్రాయుటకు చేయకల్గాలి. సంస్కృతము చదివిన వారికి ప్రాధాన్యత యివ్వబడును.

1-5-1970 నాటికి 15 సంవత్సరములకు తక్కువ (లేదా) 20 సంవత్సరములకు పైబడి వయస్సు గలిగిన అభ్యర్థులు ప్రవేశము లభించదు. అభ్యర్థులు ఆరిజాన్ కులములకు చెందినవారై యుండి శిల్పకళలో ప్రత్యేకాభిరుచి మున్నచో గరిష్ఠ వయోపరిమితిలో సడలించబడును.

(సం) యం. చంద్రమౌళిరెడ్డి
కరస్పాండెంట్

ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్

[illegible] వసతి గృహాలు, హైదరాబాద్ మరియు [illegible] విజయవాడలో అసిస్టెంటు క్యాంటీన్ మేనేజరు కావలెను. ఒకొక్క ప్రదేశములో ఒకరు [illegible] తాత్కాలికమైనా శాశ్వతము కావచ్చును. జీతము రు. 105-7-147-8-195-10-200 మరియు రూల్సు ననుసరించి అనుమతింపబడు మామూలు అలవెన్సులు శ్రీ అభ్యర్థులు [illegible]

1. అర్హతలు :	1. మెట్రిక్యులేట్ లేదా యస్. యస్. యల్. సి. లేదా దానికి సమానమైనది ప్యాసైయుండాలి.	
	2. క్యాంటీన్ హోటలు మరియు అక్కౌంటింగ్ విధానంలో [illegible] క్యాంటీను మేనేజిమెంటులో అనుభవం	
2. డ్యూటీలు :	హైదరాబాద్‌లో 1200 మంది ఉద్యోగులకు క్యాంటీన్ [illegible] క్యాంటీన్ [illegible] 600 మంది ఉద్యోగులకు కేటరింగ్ చేయు క్యాంటీన్‌లో స్వతంత్రంగా నిర్వహించాలి.	
3. వయోపరిమితి :	1-7-1970 నాటికి 30 సంవత్సరములు మించరాదు. [illegible]	

[illegible] ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ [illegible] ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్, [illegible] హైదరాబాద్-20 వారి నుండి పొందవచ్చును [illegible] 29-6-1970 తేదీకి ముందుగా అందే [illegible]

3-6-1970.
హైదరాబాద్-20

జనరల్ మేనేజరు.

ప్రయాణీకుల వస్తువులు, రు. 10 వేల నగదు లూటీ

కాన్పూర్-ఝాన్సీ ప్యాసింజర్ రైలులో

ఝాన్సీ, జూన్ 11—కాన్పూరు-ఝాన్సీ అప్ ప్యాసింజర్ రైలులోని దాదాపు ముప్ఫయి మంది ప్రయాణీకుల వస్తువులు, దాదాపు పదివేల రూపాయల నగదును పది మంది సాయుధ ముఠా నేడు లూటీ చేసింది.

ఇక్కడకు 155 కిలోమీటర్ల దూరానగల అర్సి స్టేషన్ వద్ద ప్రయాణీకుల బోగీలో ఈ సాయుధ ముఠా ప్రవేశించి కత్తులతో, బరిసెలతో వారిని బెదిరించింది.

శ్రీ విన్‌సెంట్ హెర్బర్ట్ కోయెల్హో

జపాన్‌లో భారత రాయబారిగా నియామకం

న్యూఢిల్లీ, జూన్ 10 — విదేశ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ విన్‌సెంట్ హెర్బర్ట్ కోయెల్హోను జపాన్‌లో భారత రాయబారిగా శ్రీ శశికుమార్ బెనర్జీ స్థానంలో నియమించారు.

త్వరలో ఆయన ఆ బాధ్యత స్వీకరిస్తారని భావిస్తున్నారు.

జాతీయ వనరుల వినియోగానికి సంస్థ

స్థాపించాలని రాష్ట్ర ప్రజాపార్టీ సూచన

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

రాజమండ్రి, జూన్ 11 — జాతీయం చేసిన బ్యాంకుల ప్రయోజనం దేశంలోని వెనుకబడిన 80 శాతం ప్రజానీకానికి లభ్యమై, దేశం, జాతి సర్వతోముఖాభివృద్ధిని సాధించడానికి ఈ జాతీయ వనరుల వినియోగవిత్త అభివృద్ధిసంస్థను దేశస్థాయిలో స్థాపించవలెనని, దాని శాఖలు రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ఏర్పడి చిన్నతరహా సంస్థలు, చిన్న నీటి వనరులు మొదలయినవాటిని అభివృద్ధి చేయడానికి కృషిచేయవలెనని మొన్న ఇక్కడ సమావేశమైన రాష్ట్ర ప్రజాపార్టీ కార్యవర్గం వారు కోరుతూ, బ్యాంకుల జాతీయం ద్వారా జాతిలో రేకెత్తిన ఆశలకు రూపకల్పన చేయవలెనని పేర్కొన్నారు.

సమావేశానికి రాష్ట్ర పార్టీ చైర్మన్, పార్లమెంటు సభ్యులు శ్రీ తెన్నేటి విశ్వనాథం అధ్యక్షత వహించారు.

ఆంధ్రప్రదేశ్ కౌలుదారీ బిల్లును పరిశీలించి ప్రభుత్వానికి నివేదికను పంపడానికి ఈ కిందివారితో సబ్ కమిటీని వేశారు: శ్రీయుతులు డాక్టర్ ఎ. బి. నాగేశ్వరరావు, ఆతుల బులిస్వామి, వై. వి. కృష్ణారావు, పెమ్మరాజు సుబ్బారావు, టి. కె. తిలక్, పి. తమ్మరాజు సత్తి శేషయ్య.

సంతాప సభ

రాజమండ్రి, జూన్ 11 — ఇటీవల కీర్తిశేషులైన "త్రివేణి" సంపాదకులు శ్రీ కోలవెన్ను రామకోటీశ్వరరావు, "దక్కన్ హెరాల్డు" సంపాదకులు శ్రీ జి. వి. కృపానిధి స్మారక సభ "సమాచారమ్" కార్యాలయంలో మొన్న శ్రీ ప్రొడ్డుటూరి లింగరాజు అధ్యక్షతన జరిగినది.

పార్లమెంటు సభ్యులు శ్రీ తెన్నేటి విశ్వనాథం ప్రసంగిస్తూ, జాతీయ స్వాతంత్ర్య సమర కాలంలో ప్రతివాదు తమలో వుండే దేశభక్తిని, జాతీయాభిమానాన్ని వెల్లడిచేసి కొనడానికి పత్రికారచనద్వారా కృషి సాగించారని, అటువంటి వారందరికి "ఆంధ్ర కేసరి" ప్రకాశం పంతులు గారు స్థాపించిన "స్వరాజ్య" పత్రిక ద్వారా అవకాశాలను కల్పించారని అన్నారు.

శ్రీ మద్దూరి శివరామకృష్ణయ్య, శ్రీ పోతుకూచి సూర్యనారాయణ కూడా సభలో ప్రసంగించిన పిదప శ్రీ గంధం సీతారామాంజనేయులు వందన సమర్పణం చేశారు.

కుమారకల్వలో అర్ధాంతరంగా ఎన్నికల ముగింపు

ఉద్రిక్త పరిస్థితి దృష్ట్యా

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

కడప, జూన్ 11—ఎన్నికల సందర్భంగా కుమారకల్వ గ్రామంలో కొట్లాటలు జరిగినందువల్ల ఎన్నికలను అధికార పూర్వకంగా అర్ధాంతరంగా ఆపివేసినట్లు తెలుస్తున్నది.

జిల్లా అసుపత్రి నుంచి వచ్చిన సమాచారం ప్రకారం ఒక్కరోజునే ఎనిమిది కొట్లాటలు జరిగాయి. విమిత్తం రావడం ఇటీవల కాలంలో ఇదే ప్రథమమని తెలుస్తున్నది.

ఇద్దరు ముగ్గురు డాక్టర్లకు శవపరీక్ష బాధ్యత అప్పగించినట్లు ఆసుపత్రి అధికారులు చెప్పారు.

పరిస్థితి విషమంతం మృతదేహాలను ఆసుపత్రికి తీసికొని వచ్చినప్పుడు అక్కడ వందలాది ప్రజలు గుమిగూడారు.

ఒక్కసారిగా అంతమంది హత్యగావించ బడినందున ఒక వృద్ధురాలు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ అసలు ఎన్నికలనే నిరసించింది.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడం చేతకాని ప్రభుత్వం అసమర్థతను ఆమె దుయ్యబట్టింది.

భారత్‌కు 76 వేల మంది మైనారిటీల వలస

తూర్పు పాకిస్తాన్ నుంచి అయిదు మాసాలుగా పెద్ద ఎత్తున కొనసాగినట్టు వార్త

న్యూఢిల్లీ, జూన్ 10—

ఇటీవలి వారాలలో తూర్పు పాకిస్తాన్‌నుంచి భారత దేశానికి వలస వచ్చే మైనారిటీల సంఖ్య బాగా పెరిగిపోయినట్లు నేడిక్కడ అభిజ్ఞవర్గాల ద్వారా తెలియవచ్చింది.

గత రెండు వారాలలోను రోజుకు రెండు వేలమంది చొప్పున భారత దేశానికి వలస వస్తున్నారు.

గత అయిదు మాసాలలోను వలస వచ్చిన వారి సంఖ్య 76 వేలు అని ఈ వర్గాలు వెల్లడించాయి.

భారతదేశం నుంచి పాకిస్తాన్‌కు వలస వెళుతున్న ముస్లింలు ఎవరూ లేరు.

పాకిస్తాన్‌లో రానున్న ఎన్నికలలో తమకు అడ్డంకి లేకుండా చేసుకునేందుకే ప్రభుత్వం మైనారిటీలను యీలా వత్తిడి చేసి వలస పోయేట్టు చేస్తున్నదని తూర్పు పాకిస్తాన్ అవామీలీగ్ నాయకుడు శ్రీ ముజిబూర్ రెహ్మాన్ ఇటీవల చెప్పారు.

అధికార కాంగ్రెస్ పునరుజ్జీవనకు కృషి

తీర్మానానికి ఎ. ఐ. సి. సి. చర్చలో ప్రథమ స్థానం

న్యూఢిల్లీ, జూన్ 10—ఈ నెల 13 న ఇక్కడ ప్రారంభమయ్యే ఎ.ఐ.సి.సి. సమావేశంలో పరిశీలనకు సభ్యులు దాఖలుచేసిన 72 అనధికార తీర్మానాలలో అధికార కాంగ్రెసును పునరుజ్జీవింపచేయాలని పిలుపు విచ్చే శ్రీమతి దయాచౌదరి (పశ్చిమబెంగాల్) తీర్మానానికి ప్రథమ స్థానం లభించింది.

నిన్న ఎ.ఐ.సి.సి. సెక్రటేరియెట వద్ద తీర్మానాల ఎంపికలో పార్టీ దశసూత్ర ఆర్థిక కార్యక్రమాన్ని తక్షణమే అమలుజరపాలని కోరుతున్న మరొక పశ్చిమబెంగాల్ సభ్యుడు శ్రీ కె. కె. ఛటర్జీ తీర్మానానికి ద్వితీయ స్థానం లభించింది.

ముడి పెట్రోలు మిశ్రమం దిగుమతి నిషేధం సమస్య

కేంద్ర సంస్థ ఆదేశాలకోసం ఎస్సో కంపెనీ నిరీక్షణ

న్యూఢిల్లీ, జూన్ 10—ప్రత్యేక ముడి పెట్రోలు మిశ్రమం దిగుమతుల విషయంలో న్యూయార్కులోని తమ కేంద్ర అధికారుల ఆదేశాలకోసం ఎస్సో కంపెనీ ఎదురు చూస్తున్నది.

ప్రత్యేక ముడిపెట్రోలు మిశ్రమం దిగుమతులను వెంటనే నిలిపివేయవలసిందని ఎస్సో కంపెనీని భారత ప్రభుత్వం ఇటీవల కోరింది.

బొంబాయిలోని వరిశ్రమకు, 80 : 20 ముడి పెట్రోలు మిశ్రమాన్ని మాత్రమే దిగుమతిచేయాలని భారత ప్రభుత్వం కోరింది.

ఎస్సో కంపెనీ ప్రతినిధి ఒకరు నేడిక్కడ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ, న్యూయార్కు నుంచి వారం రోజులలో సమాధానం వస్తుందని భావిస్తున్నట్టు తెలియజేశారు.

అందువల్ల నేడు పెట్రోలియం, రసాయనాల మంత్రిత్వ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఎస్సో కంపెనీ ప్రతినిధులు రద్దుచేశారు.

సంక్షిప్త వార్తలు

చక్కెర ఉత్పత్తి

న్యూఢిల్లీ, జూన్ 10—మిల్లులు చెరకు ఆడడం పూర్తి అయినప్పుడు 1969-70కి చక్కెర ఉత్పత్తి 42 లక్షల టన్నులకు పెరగవచ్చునని అధికారులు ప్రకటించారు. మే నెలాఖరు నాటికి 40 లక్షల టన్నుల ఉత్పత్తి అయినది.

* * *

వాషింగ్టన్, జూన్ 10— జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లోని అమెరికా రాయబార కార్యాలయం సిబ్బంది సభ్యుడు రాజధానిలో జరిగిన పోరాటంసందర్భంగా నిహతుడైనట్టు నేడిక్కడ ప్రకటించారు.

మార్క్సిస్టుల ఆటవిక నీతి

బెంగాల్ ఘటనపై కేరళ ఎల్.ఎస్.పి. నాయకుని ఖండన

తిరువనంతపురం, జూన్ 10 — అభ్యుదయకర పోరాటం యుగంలో మార్క్సిస్టులు పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురి ప్రాంతంలోని దూలాగామ్ వద్ద అమాయకులను హత్యచేయడం ఆటవిక రాజకీయమని, దానిని అందరూ ఖండించాలని కేరళ ఆర్. ఎస్. పి. ప్రధాన కార్యదర్శి శ్రీ శ్రీకంఠన్ నాయర్ ఒక ప్రకటనలో కోరారు.

జల్పాయిగురి ప్రాంతంలో శాంతి భద్రతలు, సద్భావం నెలకొనేందుకు వెంటనే గట్టి చర్యలు తీసుకోవాలని ఆయన ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీకి ఉత్తరం వ్రాశారు.

ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ గాడ్గిల్ జూన్ ఎనిమిదవ తేదీన మాట్లాడుతూ ఇండియన్ ప్లానింగ్‌లో అతివాద దృక్పథానికి తావు ఇవ్వడం సాధ్యం కాదని పేర్కొన్నట్టు బెంగుళూరు వార్త

ఎం. పి. లుగా 12 మంది జర్నలిస్టులు

న్యూఢిల్లీ, జూన్ 10— కొత్తగా శ్రీ చందూలాల్ చంద్రకార్ లోకసభకు ఎన్నికకావడంతో ఇప్పుడు పార్లమెంటు సభ్యులలో జర్నలిస్టులు పన్నెండు మంది వుంటారు.

శ్రీ చంద్రకార్ ప్రఖ్యాత జర్నలిస్టు. విదేశాలలో విస్తారంగా పర్యటించిన వ్యక్తి. ఢిల్లీ ప్రెస్ అసోసియేషన్‌కు వరుసగా మూడుసార్లు అధ్యక్షుడుగా ఎన్నికైన వ్యక్తి.

చారిత్రక విశేషాలు

ఏథెన్సు, జూన్ 10—దాదాపు రెండున్నర వేల సంవత్సరాల క్రితం జరిగిన చరిత్రాత్మక మరాథ్ యుద్ధంలో మృతిచెందిన పది వేలమంది వీరుల సమాధిని ఆ ప్రఖ్యాత యుద్ధ భూమిలోనుంచి వెలికితీశారు.

ఏథెన్సుకు ఈశాన్యంగా 42 కిలోమీటర్ల దూరంలోగల చారిత్రాత్మక మైదానంలో పరిశోధనలు జరిపిన అనంతరం ఈ సమాధిని వెలికితీసినట్టు పురావస్తు విశేషాల ఇన్‌స్పెక్టర్ జనరల్ ప్రొఫెసర్ స్పిరిడన్ మారింటోస్ నిన్న వెల్లడించారు.

ప్రొఫెసర్ మారింటోస్ ఒక పత్రికా గోష్ఠిలో మాట్లాడుతూ, క్రీస్తు పూర్వం 490లో పర్షియన్ దండయాత్రికులకు, ఎథీనియన్ వీరులకు జరిగిన యుద్ధంలో మరణించిన వీరుల సమాధి గురించిన పరిశోధనలు పూర్తయినట్టు తెలిపారు.

ముఖ్యమైన ఈ పరిశోధన గ్రీస్ చరిత్ర గురించిన కొత్త విశేషాలను తెలుపుతున్నది.

* * *

మద్రాసు, జూన్ 10—తంజావూరు జిల్లాలోని గ్రాండ్ ఆనకట్టకు దాదాపు అరుకిలోమీటర్ల దూరానగల పాడుపడిన క్రీస్తుశకం తొమ్మిదవ శతాబ్దపు దేవాలయంలోని శిల్పాలలో రామాయణ గాథను తెలిపే పెక్కు చిత్రాలను తమిళనాడ్ పురావస్తు శాఖ బృందం కనుగొన్నది.

పురావస్తుశాఖ డైరెక్టర్ శ్రీ ఆర్. రంగస్వామి నేడు యు. ఎన్. ఐ. విలేకరితో మాట్లాడుతూ, రెండు రోజుల క్రితమే ఈ చిత్రాలను కనుగొన్నారని, తమిళ రామాయణాన్ని వ్రాసిన కంబన్ కవి గురించి మరింత సమాచారాన్ని అందజేయగలదని చెప్పారు.

తమిళనాడు ఆహారమంత్రి శ్రీ పి. యు. షణ్ముగం రాష్ట్ర ఆహార పరిస్థితి సంతృప్తికరంగా వున్నట్టు ప్రకటించారు.

వింతలు: విడ్డూరాలు

అలహాబాద్, జూన్ 10— నుదుటిపై రెండు కళ్ళు కలిగిన మగ శిశువును ఒక రిక్షావానిభార్య ప్రసవించింది. ఈశిశువుకు రెండు పొడవైన పండ్లు, మెడ వెనుకవైపున వల్ల వెంట్రుకలు వున్నాయట!

అలహాబాద్ సమీపానగల రాజాపూర్‌లో జన్మించిన ఈ శిశువు నిన్న ప్రసవం జరిగిన వెంటనే చనిపోయింది.

* * * *

బెంగుళూరు, జూన్ 10—మైసూరు యూనివర్శిటీ ఈ ఏడాది నిర్వహించిన మెడిసిన్ ప్రీ ప్రొఫెషనల్ పరీక్షలో ప్రథమ శ్రేణిలోని మొదటి పది ర్యాంకులను మణిపాల్‌లోని కస్తూర్బా వైద్య కళాశాల గెలుచుకొన్నది. మొదటి మూడు ర్యాంకులు పొందినవారి మార్కుల శాతం 81.28 నుంచి 72.14 వరకు వున్నది.

* * *

జకార్తా, జూన్ 10— నాలుగు నెలల శిశువు నుంచి రక్తాన్ని పీల్చుతున్న యువ రక్తపిపాసిని మెడాన్‌కు చెందిన ఉత్తర సుమత్రా నగరంలో పోలీసులు అరెస్టు చేసినట్టు అంటారా అధికార వార్తా సంస్థ నేడిక్కడ ప్రకటించింది.

అంగ్రి అనే పేరుగల ఈ యువకుడు తన నేరాన్ని ఒప్పుకొన్నాడు.

సుమిత్రాలోని కొన్ని ప్రాంతాలు రక్తాన్ని పీల్చేవారికి ప్రసిద్ధి చెందాయి.

ఈ ఆచారాన్ని "పలానిక్" అంటారట.

రాజమండ్రి సెంట్రల్ జైలులో లాఠీచార్జి సంఘటన

న్యాయవిచారణ త్వరలోనే ప్రారంభం కాగలదట

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

రాజమండ్రి, జూన్ 10— ఈ నెల మూడవ తేదీన స్థానిక సెంట్రల్ జైలులో ఖైదీలపై జరిగిన లాఠీచార్జిగురించి తమ శాఖ దర్యాప్తు ముగిసిందని రాష్ట్ర జైళ్ళ శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ సి. ఎస్. పాటిల్ గత రాత్రి ఇక్కడ విలేకరులకు తెలియజేశారు.

త్వరలోనే మెజిస్టీరియల్ దర్యాప్తు జరగగలదని, దర్యాప్తు నిష్పాక్షికంగా వుండగలదని ఆయన హామీ నిచ్చారు.

విచారణ స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా, నిష్పాక్షికంగా జరగడానికి దోహదించే నిమిత్తం జైలు సూపరింటెండెంటును సస్పెండ్ చేయాలని, లేదా కనీసం బదిలీ అయినా చేయాలని శాసనసభ్యులు శ్రీ ని. ప్రభాకర చౌదరి, "న్యాయవాణి" పత్రిక సంపాదకులు శ్రీ పి. సూర్యనారాయణ మూర్తి, రాజమండ్రి బార్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీ వి. గోపాలకృష్ణతోపాటు కొందరు ప్రముఖ న్యాయవాదులు ఇన్‌స్పెక్టర్ జనరల్‌ను కోరారు.

పి. ఎస్. పి. లెజిస్లేచర్ పార్టీ నాయకుని సస్పెన్షన్

పాట్నా, జూన్ 10 — బీహార్ అసెంబ్లీలో తమ పార్టీ నాయకుడు శ్రీ సూరజ్ నారాయణ్ సింగును సస్పెండ్ చేయాలని గత కొన్ని విషయాలకు కట్టుబడి వుండగలమని పి. ఎస్. పి. బీహార్ రాష్ట్ర కార్యవర్గం నిన్న ప్రకటించింది.

నేపాల్ రాజు జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి, ప్రధాని శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, జూన్ 10— నేపాల్ రాజు జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి, ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి శుభాకాంక్షలు తెలియజేశారు.

జైపూర్ ఎ. ఐ. సి. సి. లో రిక్విజిషనిస్టుల తీర్మానం

స్వర్గీయ నెహ్రూ వ్యతిరేకించినట్టు కాంగ్రెస్ ఎన్నికల చిహ్నం కేసులో శ్రీ బెనర్జీ వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 10—

1963 లో జైపూర్ వద్ద జరిగిన ఎ.ఐ.సి.సి. సమావేశంలో రిక్విజిషనిస్టుల తీర్మానాన్ని స్వర్గీయ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వ్యతిరేకించినట్టు అఖిల భారత అధికార కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీ బి.పి. బెనర్జీ నేడు ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎదుట చెప్పారు.

తిరిగి విచారణ ప్రారంభమైన కాంగ్రెస్ ఎన్నికల చిహ్నం కేసులో ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకులు శ్రీ ఎస్. ఎన్. మిశ్రా శ్రీ బెనర్జీని క్రాస్ పరీక్ష చేశారు.

ఆ సమయంలో ఎన్నికల పరాజయాలకు దారితీసిన సంస్థ లోటుపాట్లను కనుగొనడానికి ఒక కమిటీ నియమించాలని పాటిల్ అధ్యక్షిస్తూ శ్రీ ఎస్. ఎన్. సిన్హా స్వయంగా తీర్మానం ప్రతిపాదించారని శ్రీ బెనర్జీ చెప్పారు.

సభ ప్రారంభానికి ముందు రిక్విజిషన్ అభ్యర్థన మేరకు 11 మంది సభ్యుల దర్యాప్తు కమిటీని నెలకొల్పినందున పై తీర్మానాన్ని "విపరీతమైనదిగా" పేర్కొని, కొట్టివేయాలని శ్రీ నెహ్రూ కోరినట్లు శ్రీ బెనర్జీ తెలిపారు.

ఆ సమయంలో కాంగ్రెస్ అధ్యక్షులుగా వున్న శ్రీ జి.సంజీవయ్య కూడా శ్రీ నెహ్రూ అభిప్రాయాలను సమర్థించారని, అయితే, రిక్విజిషన్ సమావేశాన్ని కొట్టివేయలేదని, శ్రీ మిశ్రా తీర్మానాన్ని ఆమోదించారని సాక్షి తెలిపారు.

తప్పిపోయిన అమెరికా జర్నలిస్టులు

కంబోడియాలో శత్రువుల చేతిలో వున్నట్టు వెల్లడి

సైగాన్, జూన్ 10— కంబోడియాలో తప్పిపోయిన ముగ్గురు అమెరికన్ జర్నలిస్టులు శత్రువుల చేతిలో సజీవంగా వున్నారని సైగాన్ [illegible] "డిస్పాచ్" పత్రిక నిన్న తెలిపింది.

ఈ ముగ్గురిలో ఫీచ్ డిస్పాచ్ [illegible] న్ ముఖ్య విలేకరి [illegible] హెరాల్డ్ విలేకరి డిస్పాచ్ [illegible] న్యూస్ సర్వీసుకు చెందిన జర్నలిస్టు వున్నారు.

పార్టీ రాజకీయాలకు అతీతంగా మత సమస్య

చర్చించాలని శ్రీ బాజ్‌పాయి సూచన: మత సామరస్య సాధనకు త్రిసూత్ర పథకం

డెహ్రాడూన్, జూన్ 10—

దేశంలో మత సమస్యను పార్టీ రాజకీయాలకు అతీతంగా చర్చించాలని జనసంఘ్ అధ్యక్షుడు శ్రీ అటల్‌బిహారీ బాజ్‌పాయ్ నేడిక్కడ పత్రికలవారితో మాట్లాడుతూ సూచించారు.

దేశంలో మతసామరస్యాన్ని పెంపొందించేందుకు తాను రూపొందించిన త్రిసూత్ర కార్యక్రమంలో ఈ సూచన ఒక భాగమని శ్రీ బాజ్‌పాయ్ చెప్పారు.

మిగతా రెండు అంశాలు: (1) వివిధ జాతుల మధ్య పరస్పర విద్వేషం, అనుమానాలు తొలగించేందుకు చర్యలను తీసుకోవడం; (2) అల్లరిమూకలను కఠినంగా శిక్షించడం.

ఆర్థిక రంగంలో తన వైఫల్యాలను కప్పిపెట్టకోడానికే ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి మతవాసేదాలీని గోరంతను కొండంతగా చిత్రిస్తోందని శ్రీ బాజ్‌పాయి అన్నారు. నక్సలైట్ల చర్యలను అదుపు చేయడంలో ఆమె విఫలమైనారని విమర్శించారు.

"మత తత్వాన్ని ఎదుర్కొంటాను"

శ్రీ అబ్దుల్లా ప్రకటన

శ్రీనగర్, జూన్ 10 — భారతదేశంలో మతతత్వానికి వ్యతిరేకంగా అగ్రశ్రేణిలో నిలబడి పోరాడేవారిలో తాను ఒకడినని శ్రీ షేక్ అబ్దుల్లా నేడు ప్రకటించారు.

ఈ ప్రమాదానికి లొంగేకన్న దాన్ని ఎదిరిస్తూ తనువు చాలిస్తానని ఆయనఅన్నారు.

రాష్ట్ర ద్వితీయ ప్రజా సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ విషయం తెలిపారు.

కాశ్మీర్ కోసం బ్రతికి, దాని కోసమే మరణించాలని ఆయన ప్రజలను కోరారు. ప్రతినైట్ కావాలని ఆయన మరల కోరారు.

ప్రజల నిజమైన వాంఛలను తెలుసుకోవాలంటే అదేమార్గమని ఆయనవాదించారు.

శాస్త్రీయ, సాంకేతిక పరిశోధన రంగంలో పరస్పర సహకారానికి పాకిస్తాన్, పశ్చిమ జర్మనీలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు రావల్పిండిలో అధికార ప్రతినిధి తెలియజేశారు.

పశ్చిమబెంగాల్‌లో "ప్రత్యక్ష రాజకీయ పోరాటం"

మార్క్సిస్టు కమిటీ ప్రకటన

కలకత్తా, జూన్ 10 — అసెంబ్లీ రద్దు సత్వర ఎన్నికలకు తేదీ ప్రకటనతోపాటు ఏడు అభ్యర్థనల పై వత్తిడి తేవడానికి, జులై రెండవ పక్షంలో రాష్ట్ర మంతటా సార్వత్రిక సమ్మె, హర్తాళ్‌తోసహా "ప్రత్యక్ష రాజకీయ పోరాటం" సాగుతుందని పశ్చిమ బెంగాల్ మార్క్సిస్టు కమిటీ నేడు ప్రకటించింది.

మాజీ ఉపముఖ్యమంత్రి శ్రీ జ్యోతిబసు ఒక పత్రికా గోష్ఠిలో ప్రసంగిస్తూ వర్షాకాలం ప్రారంభమైనందున కోత సమయానికి ముందు నవంబర్ ప్రారంభంలో ఎన్నికలు జరగగలవని తెలియజేశారు.

మహారాష్ట్ర రిపబ్లికన్ ఎం.ఎల్.ఏ. హత్య కేసులో నిందితుల విడుదల

బొంబాయి, జూన్ 10—ఈ నెల అయిదవ తేదీన కమ్యూనిస్టు శాసనసభ్యుడు [illegible] కృష్ణ దేశాయి హత్య సందర్భంగా అరెస్టుచేసిన 11 మంది వ్యక్తులను పోలీసులు నేడు విడుదల చేశారు.

నిందితులలో పెక్కుమంది 20-25 ఏండ్ల [illegible] వారు. వీరిని నెను రోజులపాటు పోలీసు కస్టడీలో వుంచారు.

రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశం

జులై 20 నుంచి ప్రారంభం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 10 — రాష్ట్ర శాసనసభ వర్షాకాలపు సమావేశం జులై 20వ తేదీ నుంచి ప్రారంభించడానికి తాత్కాలికంగా నిర్ణయించినట్టు తెలుస్తున్నది.

శాసనమండలి సమావేశం కూడా అదే రోజున ప్రారంభమౌతుంది.

అసెంబ్లీసమావేశం ఆగస్టు అయిదవ తేదీ వరకు జరుగుతుందని భావిస్తున్నారు.

జూన్ 30వ తేదీతో పదవీ కాలం పూర్తి అయిన 12 మంది శాసనమండలి సభ్యుల ఎన్నిక ప్రధాన కార్యక్రమంగా వుంటుంది.

జూన్ 17వ తేదీన జరిగే రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో, అసెంబ్లీ సమావేశం ఏదీప్తి తుది నిర్ణయం చేస్తారని తెలుస్తున్నది.

ఖైరతాబాద్ నియోజక వర్గంలో 13,15 తేదీలు సెలవు

ఉపఎన్నిక సందర్భంగా

హైదరాబాద్, జూన్ 11 — ఖైరతాబాద్ ఉప ఎన్నిక సందర్భంగా ఖైరతాబాద్ నియోజక వర్గంలో గల అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు జూన్ 13, 15 తేదీలలో శలవులు ఇస్తున్నట్టు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రకటించారు.

వర్గీకృత ప్రకటనలు

అమ్మకము

విజయవాడ, అరండెల్ పేట, రామమందిరము వీధిలోని మేడ (శ్రీకృష్ణ భవన్) అమ్మబడును. వివరములకు: డి. ఎస్. రామచంద్రరావు, జిడగంవారి వీధి, సూర్యారావుపేట, విజయవాడ-2ను సంప్రతించండి.

కావలెను

మోడరన్ ఫ్యాషన్ జ్యూయలరీకి ఏజెంట్లు కొరకు ఇండియా అంతటా అభ్యర్థులు వెంటనే కావలెను. పూర్వ అనుభవము అనవసరం. పోస్ట్ బాక్స్ 1456, (AJ)-ఢిల్లీ-6 కు వ్రాయండి.

టెక్నికల్ ట్రయినింగు

10వ క్లాసు ఆపై చదివినవారికి టెక్నికల్ ట్రయినింగు ఇచ్చి ప్రత్యేక శిక్షణ పొందిన వారికి ఉద్యోగములు చూపబడును. వివరములకు రు. 1/- పంపుము.

Y.B.M. Technical college.
Machavaram vijayawada-4

EDUCATIONAL

ఉత్తమ శిక్షణ, అత్యుత్తమ క్రమశిక్షణతో గొప్ప ఫలితములను పొందుతున్న మా కాలేజీ జూన్ 6 నుండి ప్రారంభింపబడినది, 8, 9 తరగతులు తప్పిన విద్యార్థులను మార్చి 1971 ఆంధ్రా మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణులగునటుల చేయగలము. (ప్రిన్సిపాల్ — కె. ఎ. నరసింహారావు, ఎం. ఏ., బి. ఎడ్., ఓ.

రామకృష్ణా ట్యుటోరియల్ కాలేజీ,
ఒంగోలు, స్థాపితం : 1952

నోటీసు

1956 కంపెనీస్ [illegible] ప్రకారము నా [illegible] [illegible] ఫౌండ్రీ ప్రైవేట్ లిమిటెడ్ [illegible] సంబంధించిన [illegible] మా కంపెనీ పేరు కొట్టివేయడానికి కంపెనీస్ [illegible] రిజిస్ట్రార్ హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ కంపెనీల రిజిస్ట్రారు [illegible] అభ్యంతరం [illegible] ఈ నోటీసు తేదీ నుంచి 15 రోజుల లోపల హైదరాబాద్, [illegible] ఆంధ్రప్రదేశ్, కంపెనీల రిజిస్ట్రారు [illegible] దాఖలు చేయవలెను.

[illegible] రామలింగేశ్వరరావు.
12-6-1970. మేనేజింగ్ డైరెక్టరు.
విజయవాడ.

ఆంధ్ర ప్రాంతంలో 3 సంవత్సరముల మరియు 2 సంవత్సరముల డిప్లొమా కోర్సులలో ప్రవేశము

నోటిఫికేషన్

1970-71 విద్యాసంవత్సరంలో ప్రారంభమగు దిగువ తెలియపర్చబడిన 3 సంవత్సరముల డిప్లొమా కోర్సులు మరియు 2 సంవత్సరముల షార్ట్ టరమ్ టెక్నీషియన్స్ కోర్సుల యొక్క మొదటి సంవత్సరములో ప్రవేశమునకు దిగువ పేర్కొన్న అర్హతలు కలిగియున్న అభ్యర్థుల నుండి నిర్ణీత ఫారములో దరఖాస్తులు కోరబడుచున్నవి. ఆంధ్ర ప్రాంతం (ఖమ్మం జిల్లా భద్రాచలం ప్రాంతం మరియు నల్గొండ జిల్లా మునగాల ప్రాంతం కలుపుకొని) యొక్క పదకొండు జిల్లాలలోని ఏదో ఒక జిల్లా యొక్క నేటివిటీ సర్టిఫికేటు దాఖలు చేసిన దరఖాస్తుదారుల మాత్రమే (ప్రత్యేక నిబంధనల మేరకు తప్ప) ప్రవేశమునకు పరిశీలించబడుదురు.

I. ప్రతి సంస్థలో బోధించు కోర్సుల యొక్క వివరాలు మరియు పూర్తిచేసిన దరఖాస్తు ఫారములు పంపవలసిన అధికారి వివరము

కోర్సుయొక్క వ్యాఖ్యానము	కోర్సులు బోధించు సంస్థలు	దరఖాస్తు ఫారము పొందుట మరియు పూర్తి చేసిన దరఖాస్తు ఫారము దాఖలు చేయవలసిన అధికారి వివరము
II (ఎ) 3 సంవత్సరముల డిప్లొమా కోర్సులు		
i సివిల్ ii ఎలక్ట్రికల్ మరియు iii మెకానికల్ ఇంజనీరింగ్	గవర్నమెంటు పాలిటెక్నిక్స్, గుంటూరు, శ్రీకాకుళం, విశాఖపట్టణం, నెల్లూరు, విజయవాడ, నంద్యాల, అనంతపూరు, తిరుపతి, ప్రొద్దుటూరు, మరియు గూడూరు	ప్రిన్సిపాల్, గవర్నమెంటు పాలిటెక్నిక్, విజయవాడ
iv టెక్స్టైల్ టెక్నాలజీ	గవర్నమెంటు పాలిటెక్నిక్ గుంటూరు	
v మెటలర్జీ	గవర్నమెంటు పాలిటెక్నిక్, విజయవాడ	
vi ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్	ఆంధ్ర పాలిటెక్నిక్ కాకినాడ	ప్రిన్సిపాల్, ఆంధ్ర పాలిటెక్నిక్, కాకినాడ.
vii పాటరీస్ మరియు రిఫ్రాక్టరీస్	గవర్నమెంటు సిరమిక్ ఇన్‌స్టిట్యూట్, గూడూరు	ప్రిన్సిపాల్, గవర్నమెంట్ సిరమిక్ ఇన్‌స్టిట్యూట్, గూడూరు.
viii గ్లాస్ మరియు ఎనామిల్	— డిటో —	— డిటో —
II (బి) రెండు సంవత్సరముల షార్ట్ టరమ్ టెక్నీషియన్స్ కోర్సులు		
i సివిల్ ii ఎలక్ట్రికల్ iii మెకానికల్ అండ్ iv మెకానికల్ (ఆటో)	ఆంధ్ర పాలిటెక్నిక్, కాకినాడ	ప్రిన్సిపాల్, ఆంధ్ర పాలిటెక్నిక్, కాకినాడ.
III (సి) ఫార్మసీలో రెండు సంవత్సరముల డిప్లొమా కోర్సు		
2 సంవత్సరముల కాలముగా ఫార్మసీ కోర్సు	గవర్నమెంటు పాలిటెక్నిక్స్, తిరుపతి మరియు విశాఖపట్టణం	ప్రిన్సిపాల్, గవర్నమెంట్ పాలిటెక్నిక్, విశాఖపట్టణం.

III ప్రవేశమునకు అర్హతలు (3 సంవత్సరముల కోర్సు)

ఎ) మెట్రిక్యులేషన్, హెచ్. ఎస్. సి. ప్యాస్ లేదా లెక్కలు ఆప్షనల్ సబ్జక్టుగా యస్. యస్. ఎల్. సి. పరీక్ష లేదా హెచ్. ఎస్. సి. (టెక్నికల్) పాసై యుండాలి.

లేదా

బి) యూనివర్శిటీ కోర్సు చదువుటకు లేదా పబ్లిక్ సర్వీస్ చేయుటకు ప్రవేశమునకు అర్హతగల ఇంజనీరింగ్ సబ్జక్టు లేదా లెక్కలు సైన్సు (గ్రూపుతో ఎకాడమిక్ కోర్సు సెలక్టుకాబడిన మల్టిపర్పస్ స్కూలుయొక్క హయ్యర్ సెకండరీ సర్టిఫికేట్ పరీక్ష (12 వ క్లాసు పరీక్ష) పాసై వుండాలి.

లేదా

సి) గవర్నమెంటు జూనియర్ టెక్నికల్ స్కూల్ (టెక్నికల్ హైస్కూలు) సర్టిఫికెట్ పరీక్ష ప్యాసు

లేదా

డి) యూనివర్శిటీ కోర్సు చదువుటకు లేదా పబ్లిక్ సర్వీసు చేయుటకు లేదా సమానమైనదానికి ప్రవేశమునకు అర్హతగల ఇంటిగ్రేటెడ్ స్కీమ్ ఆఫ్ ఎడ్యుకేషన్ క్రింద కాంపోజిట్ లెక్కలు మరియు సైన్సులలో యస్. యస్. సి. (క్రొత్త) Xth క్లాసు పబ్లిక్ పరీక్ష ప్యాసు.

గవర్నమెంటు సిరమిక్ ఇన్‌స్టిట్యూట్, గూడూరు మరియు గవర్నమెంటు పాలిటెక్నిక్, విశాఖపట్టణం, తిరుపతిలలో ఫార్మసీ కోర్సునకు ప్రవేశముగోరు అభ్యర్థులు దిగువ పేర్కొన్న అర్హతలు కలిగివుండాలి:

యూనివర్శిటీ కోర్సు చదువుటకు లేదా పబ్లిక్ సర్వీసు చేయుటకు అర్హతగల యస్. యస్. యల్. సి. / మెట్రిక్యులేషన్ / హెచ్. యస్. సి. / మల్టిపర్పస్ స్కూల్సు యొక్క 12 వ క్లాసు పరీక్ష/సెకండరీ ఎడ్యుకేషన్ లేదా దానికి సమానమైన దానియొక్క ఇంటిగ్రేటెడ్ స్కీము క్రింద యస్. యస్. సి (క్రొత్త X) క్లాసు పబ్లిక్ పరీక్ష పాసుకావాలి. ఫార్మసీ కోర్సులో ప్రవేశమును కోరు అభ్యర్థులు క్వాలిఫైయింగ్ పరీక్షలో సైన్సు ఒక సబ్జక్టుగా చదివియుండాలి.

2 - సంవత్సరముల షార్ట్ - టరమ్ టెక్నీషియన్స్ కోర్సులు

2 సంవత్సరముల షార్ట్-టరమ్ టెక్నీషియన్స్ కోర్సులలో ప్రవేశమునకు - లెక్కలు మరియు ఫిజికల్ సైన్సులతో పి. యు. సి. లేదా హెచ్. యస్. సి (మల్టిపర్పస్) లేదా ఇంటర్మీడియట్ లేదా సీనియర్ కేంబ్రిడ్జి పరీక్ష (ఐ. యస్. సి.) పాసై వుండుట కనీస విద్యార్హతై వున్నది.

పైన తెలిపిన పరీక్షలలో ఒకదానిలో అన్ని సబ్జక్టులలో ఒకే ప్రయత్నంలో పాసై యుండి. క్వాలిఫయింగ్ పరీక్షలో ఎలక్టివ్ సబ్జక్టులలో 45% తక్కువ కాకుండా మార్కులు సంపాదించిన అభ్యర్థులు దరఖాస్తు చేయుటకు అర్హులు. అభ్యర్థులు షెడ్యూల్డు కులములు మరియు షెడ్యూల్డు జాతులకు చెందినవారైనచో మార్కులు శాతము 40% కు తగ్గించబడును.

IV ఆంధ్ర ప్రాంతములో వున్న ఇన్‌స్టిట్యూషన్లలో దిగువ పేర్కొన్న కోర్సులలో మొత్తము సీట్ల సంఖ్యలో మూడవ వంతు తెలంగాణా ప్రాంతపు నివాసితులైన అభ్యర్థులకు రిజర్వు చేయబడినవి.

1. గవర్నమెంటు పాలిటెక్నిక్, గుంటూరులో టెక్స్‌టైలు టెక్నాలజీ కోర్సు.
2. గవర్నమెంటు పాలిటెక్నిక్, విజయవాడలో మెటలర్జీ కోర్సు.
3. గవర్నమెంటు సిరమిక్ ఇన్‌స్టిట్యూట్‌లో. గూడూరులో పాటరీస్ అండ్ రిఫ్రాక్టరీస్ మరియు గ్లాసు మరియు ఎనామిల్.

పైన తెల్పిన అన్ని కోర్సులలో ప్రవేశమునకు దరఖాస్తు ఫారములు తెలంగాణా ప్రాంతపు అభ్యర్థులు ప్రిన్సిపాల్, గవర్నమెంటు పాలిటెక్నిక్, హైదరాబాద్ వారి వద్దనుండి పొందవలెను. పూర్తి చేసిన దరఖాస్తు ఫారములు పై తెల్పిన ప్రిన్సిపాల్ వారి పేర దాఖలు చేయవలయును.

V విశాఖపట్టణం మరియు తిరుపతి పాలిటెక్నిక్స్‌లో ఫార్మసీ కోర్సులో 25 శాతము సీట్లు, నిర్ణయించబడిన కనీస అర్హతలు కలిగిన ప్రభుత్వ సర్వీసులోవున్న కాంపౌండర్లకు రిజర్వు చేయబడినవి గవర్నమెంటు సర్వీసులోవున్న అలాంటి కాంపౌండరు ప్రవేశమునకు నిర్ణయించబడిన కనీస మార్కుల శాతములో కొంత సడలింపు వుండును.

VI 3 సంవత్సరముల డిప్లొమా కోర్సులు మరియు 2 సంవత్సరముల షార్ట్ టరమ్ కోర్సులలో ప్రవేశమునకు దరఖాస్తు ఫారములు పైన పేరా II లో కాలం 3 లో తెలియపర్చబడిన ప్రిన్సిపాల్స్ నుండి పొందవచ్చును.

VII ప్రతి దరఖాస్తు ఫారము ఖరీదు రు. 1/- అయివున్నది. అవి ప్రిన్సిపాల్ యొక్క ఆఫీసుయొక్క కౌంటర్‌వద్ద నగదుగా చెల్లించవచ్చు లేదా దరఖాస్తు ఫారములు పొందుటకు ప్రిన్సిపాల్ పేర క్రాస్ చేయబడిన ఇండియన్ పోస్టల్ ఆర్డరు తీసుకొని పంపవచ్చును. మని ఆర్డర్లు. పోస్టేజి స్టాంపులు అంగీకరింపబడవు. దరఖాస్తు ఫారమునకు పంపుకొను ప్రతి అభ్యర్థనతోపాటు 24 × 10 సెం.మీ. కొలతలు గల స్వంత చిరునామా కల్గి 0.65 పై పోస్టేజి స్టాంపులు అంటించిన కవరు మరియు పోస్టల్ అధికారులచే యివ్వబడిన క్రాస్ చేయబడిన ఇండియన్ పోస్టల్ ఆర్డరు అంపవలెను. క్రాస్ చేయబడిన ఇండియన్ పోస్టల్ ఆర్డరు 5-6-1970 తేదీ ముందు నాటిదై వుండరాదు.

ఇతర వివరములు ఏమైనా కావలసినచో అభ్యర్థులు ఆయా ప్రిన్సిపాల్స్‌ను సంప్రతించవచ్చును.

పూర్తిచేసిన దరఖాస్తులు పైన తెలిపిన పేరాలో II యొక్క కాలం 3లో తెలియపర్చిన అధికారులకు 10-7-1970 తేదీ మించకుండా దాఖలు చేయాలి

వెనుకబడిన తరగతి విద్యార్థులకు రిజర్వేషన్లు లేవు.

డైరెక్టరు,
సాంకేతిక విద్యాశాఖ ఆంధ్రప్రదేశ్ హైదరాబాద్.
హైదర్‌గూడ, హైదరాబాద్.

దక్షిణ మధ్య రైల్వే

టెండరు నోటీసు

సికింద్రాబాద్, విజయవాడ మరియు హుబ్లీ రైల్వే స్టేషన్లలోని డిపార్టుమెంటుచే నడుపబడు కేటరింగ్ యూనిట్లకు 1-8-1970 నుండి ప్రారంభమగు 6 మాసముల కాలమునకు దిగువ తెలియపర్చబడిన సామగ్రి సప్లయి చేయుటకుగాను దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ స్వంతదారులైన భారతదేశ అభ్యర్థుల తరపున చీఫ్ కమర్షియల్ సూపరింటెండెంట్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారిచే సీలువేసిన టెండర్లు కోరబడుచున్నవి.

1. కందిపప్పు
2. శనగపప్పు (వేయించినది)
3. పెసరపప్పు

} ఎర్నెస్టుమనీ రు. 500/-

2. కంట్రాక్టు యొక్క సుమారు విలువ రు. 20,000/-

3. షరతులు మరియు నిబంధనలతో సహా టెండరు ఫారములకు సెట్టు ఒకటికి రు. 5/- (ఎటువంటి పరిస్థితులలోను తిరిగి యివ్వబడనిది) చెల్లించి చీఫ్ కమర్షియల్ సూపరింటెండెంట్, న్యూ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, సికింద్రాబాద్-25 వారి ఆఫీసుయొక్క కేటరింగ్ సెక్షనునుండి 26-6-1970 తేదీ మధ్యాహ్నం గం. 3-00 ల వరకు పొందవచ్చును.

4. ఎర్నెస్టుమనీ రు. 500/-లు నగదుగా చీఫ్ కాషియర్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్‌వారికి 29-6-1970 తేదీ మధ్యాహ్నం గం. 1-00లోపు డిపాజిట్ చేసి, రశీదు టెండరుతోపాటు దాఖలు చేయవలయును.

5. టెండర్లు 2-7-1970 తేదీ మధ్యాహ్నం గం. 1-00 వరకు తీసుకోబడి తిరిగి ఆదేరోజు మధ్యాహ్నం గం. 3-00లకు అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షములో టెండర్లు తెరువబడును.

చీఫ్ కమర్షియల్ సూపరింటెండెంట్,
PUB. 99/70-71 సికింద్రాబాద్.

నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము: సాంకేతిక విద్యాశాఖ

ఆంధ్ర పాలిటెక్నిక్, కాకినాడకు అనుబంధంగా వున్న ఇండస్ట్రియల్ స్కూలు

1970-71 సంవత్సరమునకు ప్రవేశములు

ఆంధ్ర పాలిటెక్నిక్, కాకినాడకు అనుబంధంగా వున్న ఇండస్ట్రియల్ స్కూలులో 1970-71 సంవత్సరమునకు ఈ క్రింద తెలియపరచిన కోర్సులలో ప్రవేశమునకు అర్హతగల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.

కోర్సు పేరు	కాలపరిమితి
1. ఆటోమొబైలు సర్వీసింగ్	2 సంవత్సరములు
2. కార్పెంటరీ మరియు కేబినెట్ మేకింగ్	3 సంవత్సరములు
3. ఎలక్ట్రిక్ అండ్ గాస్ వెల్డింగ్	2 సంవత్సరములు
4. ఎలక్ట్రిక్ వైరింగ్	2 సంవత్సరములు
5. జనరల్ మెకానిక్స్	3 సంవత్సరములు
6. హాండ్‌లూమ్ వీవింగ్	2 సంవత్సరములు

ట్యూషన్ ఉచితము, చేర్చుకొనబడిన విద్యార్థులు కాషన్ డిపాజిట్ రు. 5/- కో-ఆపరేటివ్ స్టోర్స్ డిపాజిట్ రు. 25/-, గేమ్సు ఫీ రు. 2/-, అసోసియేషన్ ఫీ రు. -/-. స్టేషనరీ ఫీ రు. 2/- కట్టాలి.

అర్హతలు :- పై కోర్సులలో చేర్చుకొనుటకు అభ్యర్థులు పాత 3rd ఫారము లేక పాత 8 వ క్లాసు లేక ఇంగ్లీషుతో పాత viii స్టాండర్డు లేక సెకండరీ ఎడ్యుకేషన్ ఇన్‌టిగ్రేటెడ్ స్కీమ్ క్రింద క్రొత్త 7 వ క్లాసు ఉత్తీర్ణులు కావాలి.

వయోపరిమితి :- అభ్యర్థులు 1-7-1970 నాటికి 14 సంవత్సరములు పూర్తిఅయి 21 సంవత్సరములు దాటకుండా వుండాలి. షెడ్యూలు కులము, షెడ్యూలు జాతికి చెందిన అభ్యర్థులకు మాత్రం వయఃపరిమితి మూడుసంవత్సరముల వరకు సడలింపబడును.

స్టయిపెండ్స్ : ఒక్కొక్క క్లాసుకు నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రు. 15/-లు చొప్పున స్టయిపెండ్ ఇవ్వబడును.

దరఖాస్తులు : ఈ క్రింద నీయబడిన వివరాలతో తెల్లకాగితము మీద దరఖాస్తు వ్రాసి, ప్రిన్సిపాల్, ఆంధ్రా పాలిటెక్నిక్, కాకినాడ, పి. బి. నెం. 102, కాకినాడ-2 వారికి 6-7-1970 న చేరునట్లు పంపాలి.

1. దరఖాస్తుదారు పూర్తి పేరు, తండ్రి పేరు, పూర్తి అడ్రసు :
2. పుట్టిన తేదీ. క్రిస్తుశకము ప్రకారము రుజువు చేయు సర్టిఫికెట్ యొక్క ఎటెస్టెడ్ కాపీ జతపరచాలి :
3. మతము :
4. అభ్యర్థి షెడ్యూల్ కులం లేక షెడ్యూల్ తెగలకు చెందునా? అట్లయిన ఆ విషయాన్ని ధృవపరిచే సర్టిఫికెట్ యొక్క ఎటెస్టెడ్ కాపీ జతపరచాలి.
5. అభ్యర్థికి అంగవైకల్యము కలదా? అట్లయిన ఆ విషయమును ధృవపరచు సివిల్ సర్జన్ హోదా కలిగిన ప్రభుత్వం మెడికల్ ఆఫీసరు వద్ద నుండి తీసికొన్న సర్టిఫికెట్ యొక్క ఎటెస్టెడ్ కాపీ జతపరచాలి.
6. ఓల్డు III ఫారం, ఓల్డు VIII క్లాస్, ఇంగ్లిషుతో ఓల్డు VIII స్టాండర్డులేక న్యూ VII క్లాసులో ఇంగ్లీషు, లెక్కలు మరియు సైన్సులలో పొందిన మార్కులు అటెస్టు చేసిన మార్కుల జాబితాను జతపరచాలి.
7. ఉత్తీర్ణతయిన అత్యున్నత పరీక్షలో పొందిన మార్కులు, అటెస్టు చేసిన మార్కుల జాబితాను జతపరచాలి.
8. ప్రాధాన్యక్రమంలో అభ్యర్థి ప్రవేశము కోరుచున్న కోర్సు లేక కోర్సులు.
9. అభ్యర్థి ఇవ్వదలచుకున్న ఇతర సమాచారము.

పై విషయములను ధృవపరుస్తూ అండి. సంరక్షకుని సంతకము. | పై అంశాలన్నీ వాస్తవమేనని ధృవపరుస్తూ అభ్యర్థి సంతకము.

దరఖాస్తునకు కిచ్చిన రిజిష్టరు నంబరు తెలిసికొనగోరు అభ్యర్థి స్వంత చిరునామా వ్రాసిన పోస్టుకార్డును దరఖాస్తుతోపాటు పంపాలి. దరఖాస్తు ఉన్న కవరుమీద "అప్లికేషన్ ఫర్ అడ్మిషన్ ఇన్ టు ఇండస్ట్రియల్ స్కూలు" అని వ్రాయాలి.

సాంకేతిక విద్యా శాఖ డైరెక్టరు,
ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

వేలం నోటీసు

ఒక విల్లీస్ జీపు A. P. Q. 26 (ఛాసిస్ నెం. CJ 3A 44151) జిల్లా వ్యవసాయాధికారి ఆఫీసు, కర్నూలు వారి ఆఫీసు ఆవరణలో 26-6-70 తేదీ ఉదయం గం. 10-30లకు బహిరంగవేలంలో డిస్పోజ్ చేయబడును. పాల్గొనదలచు పాటదారులు ఆఫీసు పనిచేయు గంటలలో వాహనమును పరిశీలించుకోవచ్చును. (జీపు ఆఫీసు ఆవరణలో వుంచబడినది.) పాట ప్రారంభం కాబోవు ముందుగా పాటలో పాల్గొనగోరువారు రు. 250-00 (రెండు వందల యాభై రూపాయలు మాత్రం) ఎర్నెస్టు మనీగా డిపాజిట్ చేయాలి. పాట పూర్తిఅయిన పిమ్మట ఎన్నికకాని పాటదారునకు ఈ సొమ్ము వాపసు చేయబడును పాట పూర్తికాగానే ఎన్నికఅయిన పాటదారు పాట మొత్తములో సగము సొమ్ము వెంటనే డిపాజిట్ చేయాలి.

ఏ కారణము చూపకయే, ఎలాంటి నోటీసు లేకుండగానే పాటను నిరాకరించు లేదా ఆమోదించు అధికారము జిల్లా వ్యవసాయాధికారి, కర్నూలు వారు కలిగియున్నారు. పాటయొక్క ఆమోదము డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్ వారి కన్‌ఫర్మేషన్‌పై ఆధారపడి వుంది.

ఎన్నికైన పాటదారు పాట ఆమోదింపబడిన పిమ్మట, అతనినుండి అంతకుముందే వసూలుచేసిన సొమ్ము పాట సొమ్మునకు సరిచేయబడును. పాటకు ఆమోదము తెల్పుతూ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్‌వారి నుండి వర్తమానములేదా కన్‌ఫర్మేషన్ వచ్చిన తేదీనుండి 15 రోజులలోగా మిగిలే పాట సొమ్ము మొత్తం చెల్లించాలి. అట్లు చెల్లించలేనిచో డిపాజిట్‌గా వసూలు చేసిన సొమ్ము వాపసుచేయబడదు. మరియు వేలంపాట షరతులకు లోబడిన రీతిన ప్రభుత్వమునకు కలిగిన నష్టమునకు ఈ డిపార్టుమెంటు పాటదారుపై క్లెయిమ్ చేయబడును.

అమలులోవున్న రూల్సు ననుసరించి సేల్సుటాక్సు ఛార్జి చేయబడును.

వాహనముయొక్క వివరములు

రిజిస్ట్రేషన్ మేక్	:	A.P.Q. 26
మేక్	:	విల్లీస్ జీపు.
ఇంజను నెం.	:	99852
ఛాసిస్ నెం.	:	CJ 3A 44151

సం. జె. సీతారామయ్య,
జిల్లా వ్యవసాయాధికారి I/c.
కర్నూలు.

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక చదవండి.

డబ్బు పెంచటమెలా ?

మార్గదర్శి చిట్‌ఫండ్‌లో చేరండి. మీడబ్బును పెంచండి. మీరు పొదుపు చేసుకొనే డబ్బు ఎక్కువ లాభం సమకూర్చడం, నిర్ణీతకాలానికి అందుబాటుకి రావటం, అంతగా అవసరమొస్తే ఉన్నపళాన పెద్దమొత్తం పొందగలగటం, ఇవన్నీ కళ్ళారా చూడండి !
మార్గదర్శి పద్ధతి పొదుపువల్ల మీకొక భద్రత ఉంటుంది. అది మీకు ఎక్కువ లాభిస్తుంది. అత్యవసర సమయాలలో మిమ్మల్ని ఆదుకుంటుంది. నిర్ణీతకాలానికి క్రమబద్ధంగా పొదుపు చేసుకొనే పద్ధతి మీకు లభిస్తుంది. మీ డబ్బును పెంచండి. మార్గదర్శి చిట్‌ఫండ్‌లో చేరండి.

డబ్బుకోసమేనా మీ చింత? మార్గదర్శి వున్నది మీ చెంత!

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్
హెడ్ ఆఫీసు : ఆబిడ్స్ సెంటర్, హైదరాబాదు-1 ఫోన్ : 46226
బ్రాంచి : రిసెంట్ రోడ్, విజయవాడ-2 ఫోన్ :7797



త్వరలో మా క్రొత్త బ్రాంచి విశాఖపట్టణ

రైతులకు విజ్ఞప్తి

నమ్మకమైన గ్రోమోర్ ఎరువులు
ఈ దిగువ బోర్డు ప్రదర్శించు
ప్యారీ ఎరువుల డిస్ట్రిబ్యూటర్ల
వద్ద మాత్రమే కొనండి

అన్ని పైరులకు అనువైన రసాయనిక ఎరువులు
గ్రోమోర్ అమ్మోనియం ఫాస్ఫేట్ 28-28-0 | గ్రోమోర్ అమ్మోనియం ఫాస్ఫేట్ 20-20-0
గ్రోమోర్ యన్.పి.కె. 22-22-11 | గ్రోమోర్ యూరియా 46-0-0
(గ్రోమోర్ ఎరువుల సరఫరాలో మీకున్న ఇబ్బందులు, వ్యవసాయ విషయాలలో)
మీకవసరమైన ఉచిత సలహాలకు మాకు వ్రాయండి.
కోరమాండల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్
126, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-3, ఆం.ప్ర.

రామేశ్వరము - మైసూరు - కేరళ
9 దినముల యాత్రలు

24-6-70 నుండి నెల్లూరు నుండి బయలుదేరి — మద్రాసు, బెంగుళూరు, మైసూరు, ఊటీ, పళని, గురువాయూరు, తిరువనంతపురం, కన్యాకుమారి, తిరుచెందూరు, రామేశ్వరము, మధుర, తిరుచ్చి, శ్రీరంగము మొదలగునవి దర్శించి 2-7-70 న నెల్లూరు చేరును.

బస్సుఛార్జి రు 81/- రు. 15/-లు పంపిన టిక్కెట్టు రిజర్వు చేయబడును.

పూర్తి వివరములకు : భారత్ త్రివేణి ట్రావెల్స్,
10/130, సంతపేట — నెల్లూరు-1

సిలోను — మలయా — జపాను — సింగపూరు యాత్రలకు ఏర్పాట్లు చేయబడును.

పెరూ భూకంపం బాధితులకు సహాయం

23 కోట్ల డాలర్లు అవసరమట

లిమా, జూన్ 11: పెరూ భూకంపం వల్ల జరిగిన నష్టాన్ని భర్తీ చేయడానికి కనీసం 23 కోట్ల డాలర్లు అవసరమవుతాయని ప్రభుత్వం అంచనావేసింది. సహాయ కార్యక్రమాలు త్వరితగతిన కొనసాగుతున్నాయి. రవాణా సౌకర్యాలు మెరుగుకావడంతో మృతులను గురించి వివరాలు కొత్తగా తెలియడంలో మొత్తం మృతుల సంఖ్య 50 వేలకు దాటినట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తున్నది.

ఆకాశవాణి

శుక్రవారం
జూన్ 13

విజయవాడ
(మీ 357.1 840 కిలోసై)

ఉ॥ 6-00 వందేమాతరం, శుభోదయం, 6-10 భక్తిరంజని, 6-40 ఆంగ్లంలో వార్తలు, 6-45 నూతన ముక్తావళి, 6-50 పొలం పనులు, 7-00 తెలుగులో వార్తలు, 7-15 సంగీతశిక్షణ, 7-30 పాలవెల్లి, 8-15 ఆంగ్లంలో వార్తలు, 8-30 చిత్తూర్ వి.ఎల్. రంగనాయకి, మ॥ 11-45 చిత్రతరంగిణి, 12-30 కార్మికుల కార్యక్రమం, 1-00 హైదరాబాద్ వలె 1-30 ఆంగ్లంలో వార్తలు, 1-40 వనితావంటలు, 1-50 తెలుగులో వార్తలు. సా॥ 5-30 బంధ్యాల సత్యనారాయణమూర్తి: గాత్రం, 5-55 స్థానిక ప్రకటనలు, 6-00 ఆంగ్లంలో వార్తలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 సంప్రదాయసంగీతం, 6-25 వ్యవసాయదారులకు, 6-30 చిత్రతరంగిణి, 7-00 తెలుగులో వార్తలు, 7-15 పంటసీమలు, 7-45 మనసుర—సిగ్గు — నాటిక. 8-00 ప్రసంగం, 8-15 రేడియో న్యూస్ రీల్, 9-00 ఆంగ్లంలో వార్తలు, 9-15 సమస్యాపూరణం, 10-35 జనగణమన, ప్రసార సమాప్తి.

హైదరాబాద్—ఎ
405.4 మీ (740 కిలోసై)

ఉ॥ 6-25 వందేమాతరం, 6-30 భక్తిరంజని, 7-00 తెలుగులో వార్తలు, 7-15 చిత్రసీమ, 7-30 గానసుధ, 7-45 సంకీర్తనం 8-15 ఆంగ్లంలో వార్తలు, మ॥ 12-30 కార్మికుల కార్యక్రమం, 1-00 వేణువు, 1-30 ఆంగ్లంలో వార్తలు, 1-40 చిత్రసీమ, 1-50 తెలుగులో వార్తలు, 2-00 వాతావరణ సూచన, 5-55 ప్రసార విశేషాలు, 6-00 ఆంగ్లంలో వార్తలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-25 వ్యవసాయదారులకు వార్తా ప్రసారం, 6-30 గ్రామసీమలు, 7-00 తెలుగులో వార్తలు, 7-15 తెలుగుబాట, 7-30 చిత్రసీమ, 7-45 నాటిక, 8-00 వేణువు, 9-00 ఆంగ్లంలో వార్తలు, 10-35 వాతావరణ సూచన, జనగణమన, ప్రసార సమాప్తి.

హైదరాబాద్—బి
288 మీ (1065) కిలోసై)

ఉ॥ 6-30 వందేమాతరం, 6-40 ఆంగ్లములో వార్తలు, 6-45 ప్రాదేశిక్ సంగీత్, 2-00 చిత్రపట్ సే, 2-10 ఉర్దూలో వార్తలు, 8-45 హిందీలో వార్తలు, 9-00 చిత్రపట్ సే, 9-30 ఉర్దూలో కార్యక్రమం, 10-30 జనగణమన ప్రసార సమాప్తి.

Printed and Published by K. L. N. Prasad at Andhra Printers Ltd., Vijayawada-2
Editor : Narla Venkateswara Rao